ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 6 డిసెంబరు 2024 | 5


నల్లజర్లలో పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి

ఓటింగ్ ఇలా.. ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఆరు జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ శాతం ఇలా నమోదైంది.

జిల్లా	కేంద్రాలు	ఓట్లు	పోలైనవి	శాతం
అల్లూరి	12	637	565	88.70
తూర్పు	20	2990	2753	92.07
ఏలూరు	20	2667	2444	91.64
కాకినాడ	22	3418	3118	91.22
కోనసీమ	22	3296	3138	95.21
పశ్చిమ	20	3729	3484	93.43
మొత్తంగా	116	16737	15502	92.62

92.62%

ఓటెత్తారు!


రాజమహేంద్రవరం తహసీల్దార్ కార్యాలయంలో ఓటేసేందుకు ఉపాధ్యాయుల క్యూ

రాజమహేంద్రవరంలో ఓటేస్తున్న టీచర్లు

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

ఓటు విలువ తెలిసినోళ్లు.. తమకు నచ్చిన.. తాము మెచ్చిన నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటెత్తారు.. జరిగేది ఉప ఎన్నికైనా ఎక్కడా వెనక్కితగ్గలేదు.. తాయిలాల్లేకున్నా.. గిఫ్ట్ బాక్సులు ఇవ్వకున్నా.. పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు.. 60 శాతం.. 70 శాతం కాదు.. ఒక దశలో నూరుశాతం ఓటింగ్ ఉంటుందా అనేటంతగా క్యూకట్టారు.. చివరికి ఆరు జిల్లాల పరిధిలో 92.62 శాతం మంది బ్యాలెట్ ఓటేశారు.. మరో మూడు రోజుల్లో మా.. స్టారెవరో తేలిపోనుంది.. ఎందుకంటే 9న కౌంటింగ్.. అదే రోజు ఫలితం వెల్లడిస్తారు.. మొత్తం మీద ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ఉపపోరు గురువారం ప్రశాంతంగా ముగిసింది.

కాకినాడలో 91.22 శాతం

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మాస్టార్లు ఓటెత్తారు.. ఓటుకు క్యూకట్టారు. నూరుశాతం దిశగా ఓటింగ్ సాగింది.. ఆరు జిల్లాల పరిధిలో ఎక్కడా ఓటింగ్ తగ్గుముఖం పటలేదు. దూరాన్ని సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. మహిళా ఉపాధ్యాయినులు పోటెత్తారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాల్లో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 16737 మంది ఓటర్లకు 15,502 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరిగింది. కాకినాడ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి ఏఆర్వో ఆధ్వర్యంలో వివిధ పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని నిత్యం పర్యవేక్షించారు. కంట్రోల్ రూమ్ నుంచి ప్రతి రెండు గంటలకు ఓటింగ్ శాతం విడుదల చేశారు. ఎన్నికల సందర్భంగా కాకినాడ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కాకి నాడ జేఎన్‌టీయూలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. అన్ని జిల్లాల నుంచి గురువారం రాత్రి స్ట్రాంగ్‌రూమ్‌కు బ్యాలెట్ బాక్సులు చేరుకున్నాయి. పోలింగ్ సిబ్బంది నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకునేందుకు ప్రత్యేక రిసెప్షన్ కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి కాకినాడ జేఎన్‌టీయూలో ఈనెల 9వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అదే రోజు సాయంత్రానికి ఫలితాలను వెల్లడిస్తారు. ఐదుగురు అభ్యర్థులు పోటీపడుతుండగా, విజేత ఎవరో తేలిపోతుంది. 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగుస్తుంది.

- ఎక్కడికక్కడ క్యూకట్టిన టీచర్లు
- ఉత్సాహంగా బ్యాలెట్ ఓటు
- ఆరు జిల్లాల పరిధిలో ఇదే సీన్
- 116 కేంద్రాల్లో పోలింగ్
- బరిలో ఐదుగురు అభ్యర్థులు
- కోనసీమలో అత్యధిక ఓటింగ్
- అల్లూరి జిల్లాలో అత్యల్పం
- కాకినాడలో కంట్రోల్ రూమ్‌లు
- జేఎన్‌టీయూలో స్ట్రాంగ్ రూమ్
- రాత్రికే తరలిన బాక్సులు
- 9న కౌంటింగ్.. ఫలితం
- 12 వరకూ ఎన్నికల కోడ్




కాకినాడలో ఓటేస్తున్న ఉపాధ్యాయుడు




అమలాపురంలో ఓటేస్తున్న టీచర్


రాజమహేంద్రవరంలో పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

తూర్పున 92.07 శాతం

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లాలో 92.07 శాతం ఓట్లు పోలయ్యాయి. జిల్లాలో మొత్తం 2990 మంది ఓటర్లు ఉండగా 2753 మంది ఓటేశారు. 237 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. ఉదయం 10 గంటలకు 20.90 శాతం, 12 గంటలకు 51.70 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 74.28 శాతం, సాయంత్రం 4 గంటలకు 90.54 శాతం పోలైంది. మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కొంత మంది టీచర్లు ఓటు హక్కు వినియోగించుకోలేదు. ప్రభుత్వ ఉపాధ్యాయులంతా ఓటు హక్కు వినియోగించుకున్నట్టు చెబుతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసేవారే కొంతమంది రాలేదనేది సమాచారం.జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను రాజమహేం ద్రవరం ఆర్ట్స్ కాలేజిలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.వీటిని జిల్లా రెవిన్యూ అధికారి (డీఆర్వో) టి.సీతారామమూర్తి,ఆర్డీవోలు ఆర్. కృష్ణనాయక్,రాణి సుస్మిత, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ దేవి తదితరులు పర్యవేక్షించారు. ఎన్నికల పరిశీలకుడు కె.హర్షవర్ధన్ స్ట్రాం గ్ రూమ్ ఇక్కడ భద్రత ఏర్పాట్లను పరి శీలించారు.నల్లజర్లలో పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి పరిశీలించారు.

3 ఓట్లు.. 150 కి.మీ

వై.రామవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం ఎగువ ప్రాంతమైన డొంకరాయి 6వ నెంబరు పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడే ఓట్లు ఉన్నాయి. వై.రామవరం నుంచి ఎన్నికల నిర్వహణ సిబ్బంది 150 కిలోమీటర్లు తరలివెళ్లి పోలింగ్ నిర్వహించారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారని జోనల్ అధికారి బాపన్నదొర చెప్పారు.



కోనసీమలో 95.21 శాతం

అమలాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. 22 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచే ఓటింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. 95.21 శాతం మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావు తెలిపారు. ఉదయం పోలింగ్ ప్రక్రియ మందకొడిగా ప్రారంభమైనప్పటికీ మధ్యాహ్నానికి ఊపందుకుంది. జిల్లాలో 3296 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 3138 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 158 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 2165 మంది పురుష ఓటర్లకు 2060 మంది, 1131 మంది మహిళా ఓటర్లకు 1078 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 95.21 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 60లో అత్యధికంగా 606 మంది ఓటర్లు ఉండగా 574 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 94.72 శాతం నమోదైంది.


కొవ్వూరులో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఆర్డీవో రాణిసుస్మిత


పిఠాపురంలో కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో మాట్లాడుతున్న ఎన్నికల ప్రత్యేకాధికారి హర్షవర్ధన్


రాజమహేంద్రవరంలో పోలింగ్ సామగ్రి అప్పగిస్తున్న సిబ్బంది


కాకినాడలో ఓటేస్తున్న టీచరమ్మ

మూడు ఇసుక ర్యాంపులకు
37 దరఖాస్తులు

రాజమహేంద్రవరం డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల టెండర్లు పిలిచిన మూడు ఇసుక ర్యాంప్‌లకు 37 దరఖాస్తులు వచ్చాయి. వంగలపూడి 1,2, జీడిగుంట ఓపెన్ ర్యాంప్‌లకు ఇటీవల టెండర్లు పిలిచారు.టెండర్లకు గురువారం చివరిరోజు కావడంతో ఇసుక కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. వీటిని శుక్రవారం ఖరారు చేయనున్నట్టు మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరుతో మోసం చేయడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ ఇన్‌చార్జి సీఐ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని టీ.నగర్‌కి చెందిన దొమ్మేటి దుర్గా వెంకట సత్యనారాయణ ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలకడంతో రెండేళ్ల కిందట తణుకు పట్టణానికి చెందిన కోసూరి రమేశ్ దఫదఫాలుగా రూ.6లక్షలు ఇచ్చాడు. అయితే అతడు సరైన సమాధానం లేకపోవడం, ఉద్యోగం రాకపోవడంతో రమేశ్ టూటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సుబ్రహ్మణ్య.. నమోస్తుతే.. 6
రేపు షష్ఠి ఉత్సవాలు
కణుపూరు వీఆర్‌వో ఆత్మహత్యాయత్నం
నన్నయలో 9న బీఈడీ స్పాట్ అడ్మిషన్లు
బాలిక అదృశ్యం మిస్టరీ 7

రేపు బడి పండుగ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రభుత్వ బడులన్నీ చరిత్రలోనే తొలిసారిగా ఓ వేడుకకు చేసుకోబోతున్నాయి. పిల్లలు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో శనివారం పండుగ నిర్వహించనున్నారు. అదే రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేస్తున్న 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్'. పిల్లల బంగారు భవితకు ఒక్క అడుగు ముందుకు అనే నినాదంతో భారీ కార్యక్రమానికి పాఠశాలలను సిద్ధం చేశారు. ఇప్పటి వరకూ స్కూల్లో పరిస్థితి తల్లిదండ్రులకు, పిల్లల చదువు పట్ల వారి మనసులో భావాలు ఉపాధ్యాయులకు పూర్తిగా తెలిసేవి కావు.ముందు ఈ ఖాళీని పూరిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చనే సత్సంకల్పంతో నిర్వహిస్తుండడంతో ఈ వేడుకకు ప్రాధాన్యం ఏర్పడింది.ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులు/సంరక్షకులకు పండుగకు రావాలంటూ ఆహ్వాన పత్రికలు అందజేశారు. జిల్లాలోని 714 ప్రాథమిక, 72 ప్రాథమికోన్నత, 202 ఉన్నత పాఠశాలల్లో బాలురు 49348, బాలికలు 54074 మంది..వారి తల్లిదండ్రులు, రాజకీయ నాయకులు,ప్రముఖులు, ప్రజాప్రతినిధులు తదితరులు సుమారు 3 లక్షల వరకూ ఈ వేడుకల్లో పాల్గొనే అవకాశం ఉంది. ఏర్పాట్లకు ఇప్పటికే జిల్లాకు రూ.23లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్షించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

నాడు అలా - నేడు ఇలా

గత వైసీపీ ప్రభుత్వంలో అటు ఉపాధ్యాయులకు బోధనకు సమయం లేకపోగా.. ఇటు విద్యార్థుల చదువు అటకెక్కింది. సీబీఎస్‌సీ, ఐబీ అంటూ రోజుకో సిలబస్, ట్యాబ్‌లు, ఫ్లాట్ ప్యానెళ్లు ఇలా ప్రచార ఆర్భాటానికి విద్యావ్యవస్థను అవస్థల్లోకి నెట్టేశారు. పిల్లల్లో అభ్యసనా సామర్థ్యం అడుగంటే దుస్థితికి చేరుకొంది. పదిప్లస్ మైనస్సయ్యింది. బోధన కోసం సమయం లేకుండా బోధనేతర పనులు ఎక్కువ కావడంతో ఉపాధ్యాయులు ఆవేదన అంతా ఇంతా కాదు. జీతాల కోసం రోడ్డెక్కిన గడ్డు రోజులను అనుభవించారు.కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రేపటి పౌరుల బంగారు భవిత కోసం అభూత కల్పనల కంటే అక్షరం ముఖ్యమని విద్యారంగాన్ని గాడిలో పెట్టే పని మొదలు పెట్టిం ది.విద్యా మంత్రిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచే నారా లోకేశ్ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

పారదర్శకతే ప్రామాణికతగా

విద్యార్థి ఉదయం బడికి వచ్చి సాయంత్రం ఇంటికి చేరుకొంటే ఆ రోజుకు చదువు గడిచిపోయినట్టు కాదు. ప్రతి విద్యార్థిని సానబట్టి తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుంది. దానికి తగిన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలి. అలాగే పిల్లల మంచి నడవడిక, క్రమశిక్షణకు తొలి అడుగు ఇంటి నుంచే వేయాలి. ఈ మూడింటికీ సమన్వయం కుదిరితే పిల్లలు సునాయాసంగా ఉన్నత స్థాయికి చేరుకోడానికి మార్గం సుగమం అవుతుంది. ఇప్పటి వరకూ పాఠశాలకు తల్లిదండ్రులు వచ్చి పిల్లాడి గురించి ఆరా తీసిన సందర్భాలు ఒకటీఅరా ఉండేవి. అలాగే పాఠశాలల్లోని స్థితిగతులపై వారికి అవగాహన ఉండేది కాదు. వీటన్నిటికీ కూటమి ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టనుంది. విద్యార్థి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు/సంరక్షకులు కూర్చుని విద్యార్థి భవిష్యత్తు, బడి అభివృద్ధే లక్ష్యంగా స్నేహపూర్వకంగా చర్చిస్తారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

తల్లిదండ్రులు, పిల్లలు, ఉపాధ్యాయులు కలిసి ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంటా ఉల్లాసంగా,ఉత్సాహంగా జరపాలని ఇప్పటికే ఆదేశాలు అందాయి.ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9-9.30 గంటల వరకూ తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు,దాతలు,ప్రముఖులు, ఎస్ఎంసీ సభ్యులు, వార్డు పెద్దలు, అధికారులకు పిల్లలు, ఉపాధ్యాయులు స్వాగతం పలుకుతారు. 9.30-11 గంటల వరకూ విద్యార్థుల ప్రో గ్రెస్ కార్డులు అందజేయడంతో పాటు పిల్లల నడవడిక, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చిస్తారు. తల్లిదండ్రుల సూచనలను స్వీకరిస్తారు. 11-11.20 గంటల వరకూ ఆసక్తి ఉన్న మహిళలకు తరగతి వారీగా రంగోళీ, పురుషులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహిస్తారు.తర్వాత35 నిమిషాలపాటు పాఠశాల మైదానంలో సమావేశం, తక్కువ నిడివి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ప్రధానోపాధ్యాయులు స్కూల్ ప్రోగ్రెస్‌పై వివరణ ఇస్తారు. అనంతరం సైబర్ క్రైంపై అవగాహన, మహనీయుల స్ఫూర్తి గాథలు, ఆహూతుల నుంచి అభిప్రాయాల సేకరణ, ప్రతిజ్ఞ ఉంటుంది. 12.35 గంటలకు అందరూ కలిసి భోజనం చేసిన తర్వాత కార్యక్రమాన్ని ముగిస్తారు.

- చరిత్రలో తొలిసారి నిర్వహణ
- జిల్లాలో 988 పాఠశాలలు
- 1,03,422 మంది విద్యార్థులు
- పాఠశాలల అభివృద్ధిపై చర్చ
- 3 లక్షల మంది వస్తారని అంచనా
- ఉదయం ఆరంభం
- మధ్యాహ్నం వరకూ నిర్వహణ
- రూ.23 లక్షలు విడుదల


పేరెంట్స్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న టీచర్లు

అద్భుతమైన కార్యక్రమం



ఇదొక అద్భుతమైన కార్యక్రమం. 988 పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లూ చేశాం. పిల్లల బంగారు భవితకు, పాఠశాల అభివృద్ధికి స్నేహపూర్వక వాతావరణంలో చర్చ జరుగు తుంది.శుక్రవారం సన్నద్ధ కార్యక్రమాలు చేయాలని చెప్పాం. మెగా పేరెంట్ టీచర్ మీట్ రోజున తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు చేశాం. పాఠశాలతో పాటు ప్రతి విద్యార్థి ప్రస్తుత స్థితిని తల్లిదండ్రులకు వివరించడమే కాకుండా వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం. ఇప్పటికే ఆహ్వాన పత్రికలు అందజేశాం.

- కె.వాసుదేవరావు,డీఈవో

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వ నిర్ణయాలకు లోబడి పరిష్కరిస్తామని రాజమహేంద్రవరం కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం రాత్రి ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థలో 2393 మంది వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ఉద్యోగపరంగా, పదోన్నతులు, జీతాలు, సెలవులు తదితర సమస్యలపై చర్చించారు.16 ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించారు. ఉద్యోగులు భోజనాలు చేయడానికి హాలు, పనివేళలు ముగిశాక ఆడుకోవడానికి షటిల్ కోర్టు, వాహనాల పార్కింగ్‌కు స్థలం ఏర్పాటు చేయాలని కోరూతు నగరపాలక సంస్థ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం వినతి పత్రం అందించింది. గ్రేడు 2 ఎలక్ట్రీషియన్ పేరూరి సూర్యప్రకాశరావుకు సహాయ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పించాలని, లేదా డూయింగ్ డ్యూటీ విధానంలో నియమించాలని కోరారు. పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న క్లీనర్లకు డ్రైవర్లుగా పదోన్నతి కల్పించాలని ఉద్యోగులు విన్నవించారు. సచివాలయంలో పనిచేస్తున్న కార్యదర్శులు తమ సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఉద్యోగులు తమ జీవితంలో పొదుపును ఒక భాగంగా చేసుకోవాలని ఉద్యోగులకు కమిషనర్ కేతన్‌గార్గ్ సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎస్ఈ జి.పాండురంగారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న,ఈఈ మాధవి, మదర్షా ఆలీ, మేనేజరు అబ్దుల్ మాలిక్ అస్సర్, రెవెన్యూ అధికారి -2 శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఉద్యోగుల సమస్యలు వింటున్న కమిషనర్

ప్రతిభను వెలికితీసేవి క్విజ్‌పోటీలు

రిలయన్స్ క్విజ్ పోటీల్లో డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5(ఆం ధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, మేధాశక్తిని పెంపొందించడానికి క్విజ్ పోటీలు దోహదపడతాయని డీఎస్ఈవో వాసుదేవరావు పేర్కొన్నారు.స్థానిక ఆనం కళా కేంద్రంలో రిలయన్స్ ఫౌండర్ ధీరుభాయ్ అంబానీ జయంతి సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలకు ఆయన హాజరై మాట్లాడారు.గత 12 ఏళ్లుగా ధీరుభాయ్ అంబానీ పేరున విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ పోటీలు ప్రతి ఏటా విద్యార్థులకు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. జిల్లాలో 160 ఉన్నత పాఠశాలల నుంచి 640 మంది విద్యార్థులు క్విజ్ పోటీలకు హాజరయ్యారని చెప్పారు. అనంతరం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మండపేట గౌతమి మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.దీక్షిత, గీతాశ్రీలకు రూ.42 వేలు విలువ చేసే రెండు ల్యాప్ టాప్‌లు అంద జేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన కాతేరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వి.వరుణ్ తేజ్, కే సత్యసాయిలకు రూ.15వేలు విలువగల రెండు ట్యాబ్‌లు అందించారు. తృతీయ స్థానంలో నిలిచిన వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 10 మందికి రూ.7500 విలువ గల సైకిళ్లను అందించారు. జనరల్ నాలెడ్జిలో ప్రతిభ చాటిన 25 మందికి వాటర్ బాటిల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ సంస్థ ప్రతినిధులు ఆపరేషన్స్ హెడ్ ప్రవీణ్ నందగిరి, సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం, ఉద్యోగులు ఐ.సత్యశ్రీనివాస్, పి.వెంకట్రావ్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ విజేతలకు ల్యాప్ ట్యాప్‌లు అందజేత

సుబ్రహ్మణ్యా నమోస్తుతే!!

ఆకాశమంత భక్తి... ఎ.వేమవరంలో 42 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం

కరప-పెనుగుదురు రోడ్డులో కోరుపల్లి వద్ద 51 అడుగుల అతి పెద్ద విగ్రహం

షష్ఠి ఉత్సవాలకు ముస్తాబైన బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడు

తాటిపర్తి, మల్లవరంల్లోనూ పూర్తయిన ఏర్పాట్లు.. రేపే షష్ఠి పండుగ

శనివారం జరిగే సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలకు ఆయా ఆలయాలన్నీ ముస్తాబు అయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలెన్నో ప్రసిద్ధి చెందినవి ఉన్నాయి. ఇందులో ప్రధానంగా బిక్కవోలులోని శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం అతి పురాతనమైంది. పంచారామాలకంటే ముందు ఈ ఆలయాన్ని నిర్మించారని చరిత్ర కథనం. ఇక అమలాపురం మండలం ఎ.వేమవరం గ్రామంలో అతి పెద్ద సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల్లో ఒకటిగా 42 అడుగులతో దర్శనమిస్తోంది. అలాగే కరప సమీపంలో 51 అడుగుల మరో విగ్రహం ఉంది. వీటితోపాటు గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి, ఆలవెల్లి మల్లవరంలలో ఉన్న ఆలయాలు స్వయంభూ కావడంతో ప్రసిద్ధ క్షేత్రాలుగా వెలుగొందుతున్నాయి. ఆ విశేషాలు ఇవీ...





ఎ.వేమవరంలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం.. కరపలో 51అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం

మలేషియా తరహాలో ఎ.వేమవరంలోనూ..

నేడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



ఎ.వేమవరంలో కొలువుదీరిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

అమలాపురం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి అతిపెద్ద విగ్రహాల్లో ఒకటి అమలాపురం మండలం ఎ.వేమవరం గ్రామంలో ఉంది. ఇందులో 42 అడుగుల ఎత్తులో ఉన్న ఈ విగ్రహాన్ని మలేషియా తరహాలో ఇక్కడ నిర్మించినట్టు ఆలయ వ్యవస్థాపకులు తెలిపారు. స్వామివారికి రక్షణ పడగగా 45 అడుగుల నాగరాజు నిలబడి ఉండడం మరో విశేషం. ఎ.వేమవరంలో ప్రసిద్ధినొందిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి 6.30 గంటలకు గూడా సత్యహరిశ్చంద్రుడు కుటుంబీకుల ఆధ్వర్యంలో స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. 85 ఏళ్ల కిందట నిర్మించిన ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. దేవస్థానం ఛైర్మన్ కొంపెల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామికల్యాణోత్సవాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

బ్రహ్మజాతి దేవతాసర్పం సంచారం..

ఎ.వేమవరంలో ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రాంతంలో పెద్ద పాముల పుట్ట ఉండేది. ఆ ప్రాంతంలో బ్రహ్మజాతి దేవతాసర్పం సంచరిస్తూ ఉండేదని నాటి పూర్వీకులు నేటికీ చెబుతున్నారు. ఆ పుట్టపై పంచ శిరస్సుల సర్పాకృతితో ఒక గుమ్మడిపాదు పెరిగింది. పశ్చిమాభిముఖంగా గుమ్మడి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వెలిసినట్టు అక్కడే ఆలయాన్ని నిర్మించమని ఓ భక్తురాలికి కలలో కనిపించి చెప్పినట్టు కథనం. స్థలదాత, సీనియర్ న్యాయవాది దివంగత గూడా సత్యహరిశ్చంద్రుడు భక్తురాలి కలను నిజం చేస్తూ ఆలయాన్ని నిర్మించారు. సంతాన సుబ్రహ్మణ్యేశ్వరునిగా, గుమ్మడి సుబ్రహ్మణ్యేశ్వరునిగా ఈ ఆలయం ప్రసిద్ధినొందింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం అనంతరం 7న షష్ఠితీర్థం జరుగుతుంది.

కరపలో 51 అడుగుల విగ్రహం

కరప, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని కరప-పెనుగుదురు ప్రధాన రహదారిలో కోరుపల్లి పరిధిలో ఉన్న 51 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంటుంది. ఇక్కడ జనసేన నేతలు చిక్కాల దొరబాబు, సుబ్బారావు ఆధ్వర్యంలో షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లుచేశారు. అదేవిధంగా కరపలో చాగంటి వంశీకులు నిర్మించిన ఆలయంలో ధర్మకర్త చాగంటి వెంకట్రావు, వేళంగిలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో షష్ఠి వేడుకలు అట్టహాసంగా జరగనున్నాయి.





సహజసిద్ధమైన పుట్టతో దర్శనమిస్తున్న బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సంతానాన్నిచ్చే బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడు సంతానం లేని స్త్రీలకు సంతాన్నిచ్చే స్వామిగా ప్రసిద్ధికెక్కాడు. ఈ స్వామికి మార్గశిర శుద్ధ షష్ఠి రోజున స్వామి వారి షష్ఠి మహోత్సవాన్ని వైభవంగా ఏళ్ల తరబడి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఈ నెల 6 నుంచి 12 వరకూ షష్ఠి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. షష్ఠి ఉత్సవాన్ని 7న నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ చరిత్ర చూస్తే.. ఈ ఆలయాన్ని పంచారామాలకంటే 300ఏళ్ల ముందే తూర్పు చాళుక్యులు నిర్మించగా 1100 ఏళ్ల చరిత్రను కలిగి ఉంది. ఈ క్షేత్రాన్ని మొదట తూర్పు చాళుక్య విజయాదిత్యుని కాలంలో విక్రమపురంగానూ, మూడో విజయాదిత్యుడిగా పేరొందిన గుణగవిజయాదిత్యుని కాలంలో బిరుదాంకినవోలుగానూ, ఆపై కాలక్రమేణా బిక్కవోలుగా నామాంతరం చెందింది. ఈ ఆలయంలో శైవ కుటుంబం మొత్తం కొలువై ఉండడం ఈ దేవాలయ ప్రత్యేకత. దీనికి మధ్యలో గోలింగేశ్వరుడు, పార్వతి అమ్మవారు, లక్ష్మీగణపతి, భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరుడు, సహజమైన పుట్టతో శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉన్నారు. గోలింగేశ్వరస్వామి ఆలయానికి ఎడమవైపు బాలాత్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి, కుడివైపు రాజరాజేశ్వరీదేవి సమేత రాజరాజేశ్వరస్వామివారి ఆలయాలు ఉన్నాయి. దీంతో త్రిలింగ క్షేత్రంగా కూడా పేరొందింది.

సుబ్రహ్మణ్యస్వామి చరిత్ర..

తూర్పుగోదావరి జిల్లాలోని బిక్కవోలులో శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వస్వామి సహజమైన పుట్టతో దర్శనమిస్తారు. సంతానం లేని స్త్రీలకు సంతాన ప్రాప్తినిచ్చే స్వామిగా పేరొందాడు. తమిళనాడులోని పళనిలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిలా దక్షిణాభిముఖంగా ఈ స్వామి భక్తులకు దర్శనమిస్తూ ఉండడంతో బిక్కవోలు గ్రామం కూడా కుమారక్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది. స్వామికి ఇష్టమైన మంగళవారం, శుద్ధ షష్ఠి, కృత్తికా నక్షత్రం రోజుల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాహు, కేతు, కుజ, సర్ప దోష నివారణార్థం భక్తులతో పూజలు చేయిస్తుంటారు. మిగిలిన రోజుల్లో స్వామివారి వద్ద ఉన్న సర్పానికి పూజలు చేయడం ఇక్కడ ప్రత్యేకత. సంతానం లేని స్త్రీలు షష్ఠి రోజున స్వామి చెంతనే ఉన్న సహజపుట్టపై నాగులచీర ఉంచి దాన్ని ధరించి ఆలయం వెనుక శయనిస్తే సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం.

బాణసంచా ప్రత్యేక ఆకర్షణ

షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీ రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు కాల్చే బాణసంచా ప్రత్యేక ఆకర్షణ.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఈనెల 7న నిర్వహించే సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జేవీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాలకు రూ.80 లక్షల వరకూ వ్యయం చేయనున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి రూ.లక్షకుపైగా భక్తులు స్వామి దర్శనానికి వస్తారని, వీరందరికీ స్వామి దర్శనాలు కల్పించడానికి భారీ క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, 12న మహాన్నదానంతో ఉత్సవాలను ముగిస్తామని చెప్పారు.



తాటిపర్తిలో వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పక్కన స్వామి నిజరూప దర్శనం (ఫైల్)



ఆలవెల్లి మల్లవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పక్కన స్వామి నిజరూప దర్శనం

స్వయంభూగా వెలసి.. వరాలిస్తూ..

గొల్లప్రోలురూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠికి ఆలయాలు ముస్తాబయ్యాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి, ఏపీ మల్లవరం గ్రామాల్లో స్వయంభూగా వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ఈనెల 7 నుంచి షష్ఠి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయాలు ముందు సంప్రదాయబద్ధంగా పందిర్లు వేశారు. విద్యుత్‌దీపాలతో అలంకరించారు. తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లో ఉన్న వారి గృహాలకు వివిధ ప్రాంతాల నుంచి బంధువుల రాక ఇప్పటికే ప్రారంభమైంది.

తాటిపర్తి క్షేత్రప్రాశస్త్యం

గొల్లప్రోలు మండలంలో తాటిపర్తి గ్రామంలో వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్వయంభూగా వెలిశారు. ఇక్కడ ఉన్న స్వామి విగ్రహంవద్ద పాము కొంతకాలంపాటు ఉండి అక్కడే చనిపోవడంతో ఆ స్థానంలో ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడికి సమీపంలోనే అపర్ణాసమేత నాగేశ్వరస్వామి ఆలయం ఉండడంతో మరింత ప్రాశస్త్యం లభించింది. సంతాన ప్రాప్తికి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో ఎరుపురంగు చారల చీర కట్టుకుని రాత్రంతా నిద్రిస్తే మంచిదని భక్తుల నమ్మిక. ఈ వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 87వ షష్ఠి బ్రహ్మోత్సవాలు ఈనెల 7న ప్రారంభమై 12 వరకూ జరుగుతాయి. శనివారం తెల్లవారుజామున స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనం, రాత్రి శూలాల సంబరం, చెట్టుభజన, తాడిపెద్దు సంబరం జరుగుతాయి. అనంతరం స్వామి కల్యాణం జరుగుతుంది. 11న స్వామి గ్రామోత్సవం, 12న స్వామి షట్ సహస్ర నామార్చన, రాత్రి పుష్కరిణిలో తెప్పోత్సవం జరుగుతాయి. 6న స్వామి, అమ్మవార్లకు పెండ్లి కుమారుడు, కుమార్తె అలంకారం, అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహిస్తారు.

ఆలవెల్లి మల్లవరం విశిష్టత..

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యక్షంగా దర్శనమిచ్చిన క్షేత్రమిది. సర్పరూపంలో భక్తులకు దర్శనమివ్వగా అక్కడే ఆలయాన్ని నిర్మించారు. 1961-64 సంవత్సరాల మధ్య ఆలవెల్లి మల్లవరంలోని పంటపొలాల్లో సర్పం రైతులకు కనిపించి కదలకుండా ఉండిపోయింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యక్షంగా కనిపించాడని భావించిన ప్రజలు పూజలు నిర్వహించి అక్కడే ఆలయం నిర్మించారు. వీరచోళ చతుర్వేద మండలం ఆలవెల్లి నిలయ మల్లవరం క్షేత్రం స్వామి కళ్యాణమహోత్సవాలు 7 నుంచి 11 వరకూ జరగనున్నాయి. 13న కల్యాణవేదిక పైఅంతస్తును ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రారంభిస్తారు.



అష్ట లక్ష్మీ సమేత వాహనంపై ఊరేగుతున్న స్వామివార్లు

వైభవంగా అనపర్తిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావడి ఉత్సవం

అనపర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): షష్ఠి వేడుకల సందర్భంగా అనపర్తిలోని వీర్రాజు మామిడి వద్ద కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావడి ఉత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాన్ని ప్రారంభించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఊరేగిస్తూ కావడి ధరించిన మాలధారులు సంతానం లేని మహిళలను దాటుతూ వారికి సంతాన ప్రాప్తి కలగాలని దీవించారు. ఇలా చేస్తే సంతానం కలుగుతుందని ఇక్కడి భక్తులు విశ్వసిస్తారు. రథానికి గ్రామంలో భక్తులు నీరాజనాలు పలికారు. కావడి ధరించిన భక్తులకు పసుపు నీళ్లతో అభిషేకాలు చేశారు. అనపర్తిలో పదకొండేళ్లగా కావడి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారని ఆలయార్చకుడు చందూశర్మ తెలిపారు. ఉత్సవంలో కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు వోగిరెడ్డి సత్తిరెడ్డి, మండ పోతారెడ్డి, మండ రామారెడ్డి, కర్రి సుధాకరరెడ్డి, తమలంపూడి వీర్రాఘవరెడ్డి, వెలగల గంగిరెడ్డి, బూరయ్య పర్యవేక్షించారు.



సంతానం కోసం ఆలయంలో కావడి ధరించిన మాలధారులు స్త్రీలపై దాటుతూ ఆశీర్వదిస్తున్న దీక్షాధారులు.. కావడి మోస్తున్న సీడీఆర్ ఆసుపత్రి వైద్యురాలు కర్రి బాంధవి



వేగ జ్యూయలర్స్‌ను ప్రారంభించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ



బాలకృష్ణ, సంయుక్త మీనన్‌లను చూడ్డానికి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు, (ఇన్‌సెట్లో) వేగ జ్యూయలర్స్ షోరూం

కాకినాడలో వేగ జ్యూయలర్స్

షోరూమ్‌ను ప్రారంభించిన ప్రముఖ సినీ నటుడు బాలకృష్ణ

హాజరైన సినీ నటి సంయుక్త మీనన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నమ్మకం, నాణ్యత ఆభరణాలుగా ఎన్నో ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రజల విశ్వాసం చూరగొన్న వేగ జ్యూయలర్స్ నాలుగో షోరూమ్ కాకినాడ బాలాజీచెరువు సెంటర్‌లో గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన వేగ జ్యూయలర్స్ బ్రాండ్ అంబాసిడర్, సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ప్రముఖ సినీ తార సంయుక్త మీనన్‌తో కలిసి షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ పుట్టిన రోజు నుంచి ప్రతిరోజు వేడుకలకు అమ్మాయికి కొనుగోలు చేసే బంగారం విలువ ఆమె వయసుతో పాటు పెరుగుతూ వస్తుందన్నారు. బంగారం అంటే ఖర్చు మాత్రమే కాదని అది భవిష్యత్తు తరాలకు సంపదన్నారు. ఇక్కడ ఒక రకం మోడల్ చూపించమంటే వంద రకాల మోడల్స్ చూపిస్తున్నారని నటి సంయుక్త మీనన్ సంతోషంగా అన్నారు. షోరూమ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన బాలకృష్ణ, సంయుక్త మీనన్‌లను చూసేందుకు భారీ స్థాయిలో ప్రేక్షకులు విచ్చేశారు. సంస్థ యాజమాన్య ప్రతినిధులు వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా తమ వేగ జ్యూయలర్స్ ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన బంగారు ఆభరణాలు అందిస్తూ వారి విశ్వాసం పొందాయన్నారు. నూతన షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 12వ తేదీ వరకు ప్రజలకు ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్టు ప్రకటించారు. ప్రతి ఆభరణం పైన వీఏ 4.99శాతం నుంచి 11.99శాతం వరకు ఉంటుందన్నారు. బీఐఎస్ హాల్‌మార్క్ బంగారు ఆభరణాలు సర్టిఫికెట్ తోటి డైమాండ్స్ క్యారట్ ధర రూ.50,999 మాత్రమేనన్నారు. తమ షోరూమ్‌లో సంప్రదాయ ఆభరణాల నుంచి ఆధునిక ఫ్యాషన్ ఆభరణాల వరకు... చిన్న కాసు నుంచి భారీ వడ్డాణాల వరకు, ముక్కుపుడక నుంచి ముత్యాల హారాలు వరకు లభిస్తాయన్నారు. ఎన్నో రకాల ఉంగరాలు, చెవి దుద్దులు, గాజులు, నక్లెస్‌లు, బ్రాస్‌లెట్స్ అందిస్తున్నామన్నారు. వధువు ధరించే ఆభరణాల నుంచి రోజూ ధరించే ఫ్యాన్సీ ఆభరణాల వరకు, వివాహాల కోసం బహుమతిగా ఇవ్వడం కోసమైనా... ఇంట్లో జరిగే వేడుక ఏదైనా 'వేగ' తోడుంటే అది మరపురాని మధురానుభూతిని కలకాలం నిలుపుతుందన్నారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు అమన్‌జైన్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

రంపచోడవరం, చింతూరు డివిజన్లలో 88.70 శాతం పోలింగ్

రంపచోడవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు మన్యంలో ప్రశాంత వాతావరణంలో జరిగాయని రంపచోడవరం సబ్ కలెక్టరు, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కేఆర్ కల్పశ్రీ తెలిపారు. చింతూరు, రంపచోడవరం డివిజన్లలో 88.70 శాతం పోలింగ్ జరిగిందన్నారు. 12 పోలింగ్ కేంద్రాల్లో 637 ఓటర్లకు 565 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తెలిపారు. రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని కల్పశ్రీ పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దారు రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్లు సత్యనారాయణ, త్రిమూర్తులు, శ్రీధర్, శివ, ఆర్ఐ జిలాని ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టరు కల్పశ్రీ

8న ఆర్చరీ పోటీలు

పిఠాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 8వ తేదీ ఉదయం 9గంటల నుంచి అమలాపురం సర్ సీవీరామన్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎన్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. సబ్‌జూనియర్స్ ఆర్చరీ ఇండియన్ రౌండ్, రికర్వో కాంపౌండ్ బాలబాలికల విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనేవారు 2007, జనవరి 1 తర్వాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. వివరాలకు 9989001162 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

నన్నయలో 9న బీఈడీ స్పాట్ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్య కళాశాలలో ఈనెల 9న బీఈడీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. బీఈడీ రెండేళ్ల కోర్సుకు బీఏ, బీకామ్, బీఎస్సీ, బీటెక్ డిగ్రీ పూర్తి చేసి ఎడ్‌సెట్-2024 పరీక్ష రాసిన వారు అర్హులన్నారు. విద్యార్థులు ఈనెల 9న ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి ప్రవేశ రుసుం చెల్లించి అడ్మిషన్ పొందవచ్చునన్నారు. వివరాలకు 70930 08473 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఆత్రేయపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం రావడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లికి చెందిన ఎడ్ల నాగఫణీంద్ర(27) పచ్చళ్ల వాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పచ్చళ్ల వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురైన ఫణీంద్ర ఈనెల 3న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గురువారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

కొత్త రేషన్‌కార్డులు.. ఎప్పటినుంచి?

- రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణపై సందిగ్ధత.. స్పష్టత రాని వైనం
- గురువారం రాత్రికి కూడా జారీ కాని మార్గదర్శకాలు
- సచివాలయాలకు వెళ్తున్న అర్హులు
- స్పష్టత లేక తప్పని ఎదురుచూపులు



సామర్లకోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకారంపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం ఈనెల 2వతేదీనుంచి సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరణ ప్రారంభిస్తామని ప్రకటించడంతో ఆశావహులు సంతోషం వ్యక్తం చేశారు. సచివాలయాలకు పెద్దసంఖ్యలో చేరుకుని దరఖాస్తుకు ప్రయత్నిస్తున్నారు. కానీ, సచివాలయాలకు నాలుగురోజులుగా ఇందుకు సంబంధించి యాప్ ఓపెన్ కాకపోవడం, ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు సైతం రాకపోవడంతో ఆశావహులకు ఏం చెప్పాలో తెలియని అయోమయ పరిస్థితిని సచివాలయాల సిబ్బంది సోమవారం నుంచి గురువారం రాత్రి వరకూ ఎదుర్కొన్నారు.

సంక్రాంతికి కొత్త కార్డులంటూ..

డిసెంబరు 2 నుంచి 28 వరకూ అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద కొత్త రేషన్‌కార్డులు, ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించబోతోందని, కొత్త డిజైన్లతో రేషన్‌కార్డుల పంపిణీ చేయ నుందని కొన్నిరోజులుగా అధికార యంత్రాంగం ప్రచారం నిర్వహించింది. సంక్రాంతి పండుగకి కొత్త కార్డులు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని కూడా కొందరు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి గురువారం సాయంత్రం నాటికి కూడా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీకాలేదు. దీంతో దరఖాస్తుదారులకు ఏం చెప్పాలో, దరఖాస్తులు స్వీకరించాలో వద్దో తెలియని అయోమయ పరిస్థితిలో గ్రామ, వార్డు సచివాలయాలసిబ్బంది కొట్టుమిట్టాడుతున్నారు.

పది నెలలుగా పెండింగ్

ఇంచుమించు 10నెలలుగా కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల్లో స్వీకరించడంలేదు. ఇందుకు సంబంధించి ఈ-పోస్ సైట్‌ని బ్లాక్ చేశారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వచ్చిన దరఖాస్తులు వందల్లో పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారులు తెలిపారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్‌తో రేషన్ కార్డులకు సంబంధించి ఎలాంటి దరఖాస్తులను స్వీకరించడంలేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడగా వైసీపీ రంగులతో ఉన్న రైస్‌కార్డులను తొలగించాలని నిర్ణయించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన రేషన్‌కార్డుల్లో మొత్తం కుటుంబసభ్యుల ఫొటో ఉండేది. అలానే కుటుంబ పెద్ద, వృత్తి, పుట్టిన తేదీ, వయస్సు, వార్షికాదాయం వంటి వివరాలు ఉండేవి. గత వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించి రైస్‌కార్డులంటూ సచివాలయాల ద్వారా పంపిణీ చేసింది. ఆ కార్డుల్లో కుటుంబ సభ్యుల ఫొటోను తీసేసి కేవలం ఆ కుటుంబంలో మహిళ ఫొటోను మాత్రమే ఉంచింది. ఆ కార్డులను గుర్తింపు కార్డులుగా పరిగణించలేని పరిస్థితి.

దరఖాస్తుదారుల ఎదురుచూపులు

కొత్తకార్డులు, స్ప్లిట్ కార్డులు, ఇతర సవరణల కోసం పెట్టుకున్న దరఖాస్తులను గతప్రభుత్వం నిలిపివేసింది. ఆరంచెల మూల్యాంకనం ద్వారా వేలల్లో కార్డులను తొలగించింది. ఈ కారణంగా ఇప్పుడు వంటగ్యాస్ సబ్సిడీలకు కూడా కొందరు దూరమయ్యారు. ఇతర సంక్షేమ పథకాలను పొందలేకపోయారు. కాకినాడ జిల్లాలో ఇప్పటికే 16లక్షల20వేల కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. మరో 3.30 లక్షల వరకూ కొత్తకార్డులు మంజూరు చేయాలని దరఖాస్తుదారులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఇంకా అర్హులు మిగిలిపోయి ఉండడంతో వారికి కార్డులు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. తగిన మార్గదర్శకాలు రాకపోవడంతో గురువారం సాయంత్రం వరకూ సచివాలయాలకు దరఖాస్తులతో వచ్చేవారు నిరాశగా వెనుదిరుగుతున్నారు. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులను వివరణ కోరేందుకు గురువారం రాత్రి ప్రయత్నించగా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కావడంలో కాస్త ఆలస్యమైందని స్పష్టం చేశారు.



సామర్లకోట భీమేశ్వరాలయంలో హుండీలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

సామర్లకోట భీమేశ్వరాలయ ఆదాయం రూ.కోటి34లక్షలు

సామర్లకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో కార్తీక మాసం పర్వదినాలు పురస్కరించుకుని భక్తుల రాక పెరగడమే గాక ఆలయ ఆదాయం సైతం అనూహ్యంగా పెరిగిందని ఆలయ ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. గురువారం సాయంత్రం వరకూ ఆలయంలోని హుండీలు దేవదాయ అధికారులు, సామర్లకోట భక్త జనావళి మధ్య హుండీలు లెక్కించారు. నెలరోజుల పర్వదినాల్లో భక్తులు ద్వారా ఆలయానికి రూ.1కోటి34 లక్షల24వేల198 సమకూరాయన్నారు. వీటిలో హుండీల ద్వారా రూ.24.19లక్షలు, ప్రసాదాల

- కార్తీకమాసంలో పెరిగిన ఆదాయం

విక్రయాల ద్వారా రూ.15.79లక్షలు, నిత్యాన్నదాన విరాళాల ద్వారా రూ.30.95లక్షలు, వివిధ పూజా రుసుములు, దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.48.42లక్షలు, సేవల టికెట్ల ద్వారా రూ.4.76లక్షలు, ఆన్‌లైన్ విరాళాల ద్వారా రూ.10.02లక్షలు, టెంపుల్ డొనేషన్ల ద్వారా రూ.10వేల15 చొప్పున లభించినట్లు తెలిపారు. గత కార్తీకం ఆదాయంతో పోలిస్తే అదనంగా రూ.31.11లక్షలు లభించినట్లు ఈవో తెలిపారు. దేవదాయ అధికారులు వి.ఫణికుమార్, టీవీ సూర్యనారాయణ, కంటే బాబు పాల్గొన్నారు.

పిఠాపురం పాదగయకు కార్తీకమాస ఆదాయం రూ.46.72లక్షలు

పిఠాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి కార్తీకమాసంలో రూ.46.72లక్షల ఆదాయం సమకూరింది. అభిషేకాలు, పూజాది రుసుములు, దర్శనం టిక్కెట్లు, ప్రసాద విక్రయాలు, ఇతరత్రా మార్గాల్లో ఈ ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. 2023 కార్తీకమాసంతో పోల్చుకుంటే రూ.9.77లక్షలు ఆదాయం అదనంగా వచ్చిందని చెప్పారు. కార్తీక మాసోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, పురప్రముఖులు, అధికారులు, భక్తులు, సేవా సంఘాల ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. భక్తులకు మరింత మెరుగ్గా సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

అంతర్వేది లక్ష్మీనరసింహుడి కార్తీకమాసం ఆదాయం రూ.కోటి16లక్షలు

అంతర్వేది, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. కార్తీకమాసం నెలరోజులకు రూ.1,16,11,590 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు. ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.19,37,800, వసతి గదులకు రూ.1,52,437, విరాళాల ద్వారా రూ.84,646, లడ్డూ ప్రసాదానికి రూ.14,25,420, స్వామివారి అభిషేకాలకు రూ.2,58,400, సుదర్శనహోమం ద్వారా రూ.4,37,200, టన్సూర్ ద్వారా రూ.21,250,ఇతర సేవల ద్వారా రూ.52,176, నిత్యాన్నదాన ట్రస్టు ద్వారా రూ.41,12,521, హుండీల ద్వారా రూ.31,29,740, మొత్తం రూ.1,16,11,590 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. స్వామివారి అనుబంద దేవాలయమైన నీలకంఠేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.45,084 వచ్చినట్టు తెలిపారు. ఎంపీటీసీ భైరా నాగరాజు పాల్గొన్నారు.



హుండీ ఆదాయ లెక్కింపును పరిశీలిస్తున్న ఏసీ సత్యనారాయణ

బ్యాంక్ యాప్ ద్వారా సైబర్ మోసం

- ఏజెన్సీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో మరో సైబర్ నేరం
- రెండు ఎకౌంట్లో ఉన్న మొత్తం రూ.1.48లక్షలు గల్లంతు

మోతుగూడెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో రోజుకోచోట సైబర్ నేరాలు జరుగుతున్నా కొందరిలో అవగాహన లేక నేరాలు ఆగడంలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతం చింతూరు మండలం మోతుగూడెంలో గురువారం పప్పు చిరంజీవి అనే వ్యక్తి ఉదయం 10.30గంటలకు ఆయనకు ఫోన్ వాట్సాప్‌కు ఓ బ్యాంక్ యాప్‌నకు సంబంధించి నాలుగుసార్లు వాట్సాప్ మెసేజ్ వచ్చాయి. మెసేజ్ ఓపెన్ చేసి చదివే లోపు టకటకమని రెండు ఎకౌంట్లో ఉన్న డబ్బు రూ.1.48లక్షలు గల్లంతయ్యాయి. దీంతో లబోదిబోమంటూ బాధితుడు యూనియన్ బ్యాంక్ వద్దకు వెళ్లి మేనేజర్ విత్తనాల సత్యనారాయణను కలిసి పరిస్థితిని తెలియజేశారు. వెంటనే బ్యాంక్ మేనేజర్ స్పందించి హెడ్ ఆఫీస్ ముంబాయి ఫోన్ చేసి ఖాతాదారు అకౌంట్ హోల్డ్ చేశారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు నుంచి వాట్సాప్ ద్వారా ఎటువంటి సందేశాలు ఖాతాదారులకు పంపరని గుర్తించాలని తెలియజేశారు. ఒకవేళ సైబర్ నేరగాళ్ల ఇటువంటిని ఏమైనా పంపిస్తే అప్రమత్తమై బ్యాంకు వద్దకు వచ్చి తెలియజేయాలని, అనుమానాస్పద మెసేజ్‌ను ఎట్టి పరిస్థితుల్లోను ఓపెన్ చేయకూడదని విజ్ఞప్తి చేశారు. బ్యాంకు సమాచారం ఏదైనా వినియోగదారులకు తెలియపరిస్తే అది మామూలు మెసేజుల ద్వారా సమాచారం వస్తుందని, గుర్తించచాలని తెలియజేశారు. ఈ మధ్యకాలంలో వివిధ రకాల యాప్‌ల ద్వారా సైబర్ మోసాలు ఎక్కువగా ఉన్నాయని, వాటి పట్ల అప్రమత్తమై ఉండాలని బ్యాంకు మేనేజర్ ఖాతాదారులు తెలియజేశారు. గతంలో జరిగిన ఘటనలో ఫోర్ బైలో రూ.75వేలు, పొల్లూరులో రూ.60వేలు, మోతుగూడెంలో రూ.70వేలు ఫోన్ యాప్ ద్వారా పంపి ఇలాంటి సంఘటనల్లో డబ్బులు మోసపోయారని సమాచారం.

ప్లాస్టిక్ సర్జరీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ ప్రారంభం





- 100మందికి పైగా దేశవ్యాప్త ప్లాస్టిక్ సర్జన్లు హాజరు
- రెండు సెషన్లుగా నిర్వహణ
- మృతదేహంపై ప్రయోగాత్మకంగా శాస్త్రీయ ప్రక్రియలు
- లైవ్‌డెమానిస్ట్రేషన్ ద్వారా ప్రదర్శన
- మరో రెండురోజులపాటు సదస్సు

కాకినాడ జీజీహెచ్‌లో మృతదేహంపై ప్రయోగాత్మకంగా శాస్త్రీయ ప్రక్రియలను లైవ్ డెమానిస్ట్రేషన్ ద్వారా ప్రదర్శన ఇస్తున్న ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు.. తిలకిస్తున్న వైద్యవిద్యార్థులు

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్, రీకనస్ట్రక్టివ్ అండ్ ఈస్తటిక్ సర్జన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ(ఏపీఆర్ఏఎస్‌సీఓన్) 21వ ప్లాస్టిక్ సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు కాకినాడ రంగరాయ వైద్యకళాశాల, కాకినాడ జీజీహెచ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు వర్క్‌షాపులతో కూడిన సదస్సు గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఏపీఆర్ఏఎస్‌సీఓన్ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రత్నభూషణ్ ఆధ్వర్యంలో జీజీహెచ్ ప్రాంగణంలోని ఫోరెన్సిక్ మెడిసన్ సెమినార్ హాల్లో హైదారాబాద్, పూణేకు చెందిన ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ వై.వెంకటరమణ, డాక్టర్ ఆశీష్ దావల్ భక్తలు ముఖ్య అతిథులుగా హాజరై లైవ్ డెమోనిస్ట్రేషన్ ద్వారా రెండు వర్క్‌షాపులను నిర్వహించారు.

ఉదయం.. మధ్యాహ్నం..

ఉదయం సెషన్‌లో ఫేషియల్ ఈస్తటిక్స్‌పై కడావర్ డిసెక్షణ్ నిర్వహించారు. ఈ ప్రక్రియలో ముఖ్యంగా సౌందర్యంపై శాస్త్రీయ ప్రక్రియలను మృతదేహంపై ప్రయోగాత్మకంగా నిర్వహించారు. మధ్యాహ్నం సెషన్‌లో కోలకత్తాకు చెందిన ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర విక్రమ్ సింగ్ రాథోర్ ముఖ్యఅతిథిగా హాజరై జనరల్ సర్జరీ సెమినార్ హాల్లో బొటోక్స్, ఫిల్లర్స్, థ్రెడ్స్‌పై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాపులకు 100మందికి పైబడి ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణులు వివిధ రాష్ట్రాల నుంచి హాజరయ్యారు. శుక్ర, శనివారాల్లో జరగబోయే సదుస్సు కాకినాడ వివేకానంద పార్క్ ప్రాంగణంలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రత్నభూషణ్ తెలిపారు.

అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు ‘తూర్పు’ పురుషులు, మహిళల జట్టు ఎంపిక

సామర్లకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపాన సంత నూతలపాడులో ఈ నెల 7 నుంచి 12 వరకూ జరగనున్న 71వ అంతర్‌జిల్లాల పురుషులు, మహిళల కబడ్డీ క్రీడా పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ గురువారం పూర్తి చేశామని, పోటీల్లో పాల్గొనేందుకు జట్టు సభ్యులు గురువారం సాయంత్రం రైలులో బయలుదేరి వెళ్లారని ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్, కోశాధికారి నిమ్మకాయల కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం రాత్రి వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా తరఫున పాల్గొనే పురుషుల, మహిళల జట్టు క్రీడాకారులకు క్రీడా దుస్తులను సామర్లకోట టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగపు ఉపాధ్యక్షులు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్(చిన్నీ) సౌజన్యంతో అందజేశామన్నారు. ఈ రెండు జట్ల క్రీడాకారులకు కోచ్‌గా పోతుల సాయిప్రసాద్ వ్యవహరిస్తారని కార్యదర్శి శ్రీనువాస్, కోశాధికారి కిరణ్ కుమార్ తెలిపారు.

పురుషుల జట్టు: కె.శ్రీనివాస్, వి.పవన్‌కుమార్, నాగు, శ్రీహరి, మనోహర్, దుర్గారావు, డేవిడ్, వెంకటనాథ్, ప్రశాంత్, నవీన్, మణి, ప్రవీణ్‌లు ఉన్నారు.

మహిళల జట్టు: అపరంజిత, పరిమళ, నాగమణి, అరుణ, ఆషీకం, వర్షిత, లీలా, భవాని, దీపిక, మంజుల, వెంకటలక్ష్మి, జీవనజ్యోతి.



ఎంపికైన ఉమ్మడి జిల్లా కబడ్డీ క్రీడాకారులతో కోచ్ తదితరులు

బాలిక అదృశ్యం మిస్టరీ

- కిడ్నాప్‌నకు గురైందంటూ తల్లిదండ్రుల ఆరోపణ
- బాలికను స్కూల్ నుంచి తీసుకెళ్లి పోయిన ఓ మహిళ

అమలాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న 14ఏళ్ల బాలిక అదృశ్యం మిస్టరీగా మారింది. ఆ బాలిక కిడ్నాప్‌కు గురైందా లేక అదృశ్యమైందా అనేది చర్చనీయాంశమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మలికిపురం మండలం తూర్పుపాలెంగ్రామానికి చెందిన బాలిక స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఆ గ్రామంలోని చికెన్ షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి భార్య మూడురోజులక్రితం హైస్కూల్‌కు వెళ్లి బాలికకు మాయమాటలు చెప్పి స్కూల్‌నుంచి తీసుకెళ్లి తర్వాత బయట నుంచి ఓ మోటారుసైకిల్‌పై ఉన్న యువకుడితో వారు వెళ్లినట్లు సమాచారం. అక్కడ సీసీ కెమెరాలను అదేరోజు సాయంత్రం పరిశీలించిన బాలిక తల్లిదండ్రులు ఈ వ్యవహారంపై మలికిపురం పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు మాత్రం బాలిక అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి ఆలస్యంగా దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగి మూడురోజులు కావడంతో బాలిక ఆచూకీపై తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. బాలికను ఉద్దేశపూర్వకంగానే కిడ్నాప్ చేశారా లేక బాలిక అదృశ్యమైందా అనే దానిపై పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది. అయితే బాలిక అదృశ్యంపట్ల పోలీసులు నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు యోగా దోహదం

- నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్
- విశ్వవిద్యాలయ యోగా జట్టు ఎంపిక

దివాన్‌చెరువు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు యోగా దోహదపడుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ వర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో యోగా అంతర్ కళాశాలల పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలు గురువారం నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ అనుబంధ కళాశాలల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు యోగా దోహ దపడుతుందని, యోగాసనాల్లో విద్యార్థులంతా పట్టు సాధించి ఆరోగ్యవంతమైన సమాజానికి కృషిచేయాలన్నారు. ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల మాట్లాడుతూ యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఎనిమిది మంది వంతున విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశామని తెలిపారు.

పురుషుల జట్టు: టి.సూర్య, జి.స్వామి(ఎస్కేవీటీ ప్రభుత్వడిగ్రీకళాశాల,రాజమహేంద్రవరం), టి.పవన్‌కుమార్, కె.పవన్‌కుమార్, డి.మణికంత, జె.మణిసత్య(ఆకుల శ్రీరామ డిగ్రీ కళాశాల, తణుకు) పి.సత్తిబాబు, ఎం.హరింద కిషోర్(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమండ్రి) ఎంపికయ్యారు.

మహిళల జట్టు: బి.భవానిప్రసన్న, బి.నాగలక్ష్మిదుర్గ, కె.జ్యోతి, ఎ.సౌమ్య నాగవల్లి(ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, తణుకు) సీహెచ్ మాధవి(డీఎన్ఆర్ కళాశాల, భీమవరం) టి.లావణ్య, పి.నాగలక్ష్మి(ఆకుల శ్రీరామ డిగ్రీ కళాశాల, తణుకు), కె.హర్షనదేవి(ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం) ఎంపికయ్యారు. వీరు ఈనెల 24 నుంచి 27 వరకూ భువనేశ్వర్‌లోని కిట్ విశ్వవిద్యాలయంలో అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయం పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శులు కె.బాలసత్యనారాయణ, ఎ.సత్యనారాయణ, పరిశీలకుడు ఎల్.రమేష్, ఎంపిక కమిటీ సభ్యులు శివశంకర్, ఇ.గౌరిఅనూష, వ్యాయామ విద్యఅధ్యాపకులు బి.రామ్‌గోపాల్, డేవిడ్, సుబ్రహ్మణ్యం బాషా పాల్గొన్నారు.



అఖిలభారత యోగా పోటీలకు ఎంపికైన నన్నయ పురుషుల, మహిళల జట్టు

కణుపూరు వీఆర్వో ఆత్మహత్యాయత్నం

గోకవరం/కోరుకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కణుపూరు గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న తామడ సత్యనారాయణ ఆత్మహత్యకు యత్నించారు. విధి నిర్వహణలో భాగంగా తీవ్రఒత్తిడి, అప్పులబాధ, కుటుంబ తగాదాల నేపథ్యంలో ఈనెల 4న పురుగుల మందు తాగారని, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానేఉందని సమాచారం. కాగా సత్యనారాయణ స్వగ్రామం గోకవరం మండలం వెదురుపాక గ్రామం. కాగా గోకవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణను గురువారం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు పరామర్శించారు. ఆయన

- పురుగుల మందు తాగిన రెవెన్యూ అధికారి

యోగక్షేమాలను కుటుంబసభ్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో సంఘం నాయకులు మంగి అప్పలనాయుడు, అనంతరపు శ్రీనివాసరావు, పి.శంకర్రావు తదితరులున్నారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర రాజు మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ అధికారుల వైఖరిలో మార్పు రాలేదని, మార్పు రాకపోతే జిల్లావ్యాప్తంగా వీఆర్వోలు విధులు బహిష్కరిస్తారని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

పీటీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలిగా భవాని



నియామకపత్రాన్ని అందుకుంటున్న భవాని

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పేరెంట్స్ టీచర్స్ అండ్ స్టూడెంట్స్ యునైటెడ్ ఫెడరేషన్ (పీటీఎస్ఎఫ్) మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా నల్లబోతుల భవానిని నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లాపు వేణు తెలిపారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర అధక్షురాలిగా భవాని, ఉపాధ్యక్షురాలిగా పెందుర్తి ధనలక్ష్మి, రాష్ట్ర మహిళా కార్యదర్శిగా పరమట భారతి, సహాయ కార్యదర్శిగా దొంగా పద్మజను నియమించామని తెలిపారు. అందరు చదవాలి అందరు ఎదగాలి అనే లక్ష్యంతో పీటీఎస్ఎఫ్ ఏర్పడిందన్నారు. సమావేశంలో మహిళా విభాగం రాష్ట్ర కోశాధికారి షేక్ కరీమున్నిసాబేగం, అరుణకుమారి, ఎన్.శ్రీనివాసరావు, కాకిలేటి దుర్గారావు, దొంగా వేణు, పద్మజ, పి.సత్య పాల్గొన్నారు.

పులిసాగర్ నేరచరిత్ర తెలుసుకుని మాట్లాడు భరత్

టీడీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు చిన్నరాజు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి కించపరిచి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన పులి సాగర్ నేరచరిత్ర తెలుసుకుని అప్పుడు మాజీ ఎంపీ భరత్ రామ్ మాట్లాడాలని టీడీపీ నగర ఎస్సీసెల్ అధ్యక్షుడు చాపల చిన్నరాజు, 47వ డివిజన్ ఇన్‌చార్జి బేసరి చిన్న అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కించపరిచే పోస్టులు పెట్టిన పులి సాగర్‌ను పోలీసులు అరెస్టు చేశాక అతని నేరచరిత్ర తెలిసిందన్నారు. ఐదేళ్లలో దళితుల హత్యలు, అవమానాలు, శిరోముండనాలు వంటి ఎన్నో ఘోరాలు జరిగితే నోరుమొదపని భరత్‌రామ్ ఈ రోజు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. పులి సాగర్ ముందస్తు పథకం ప్రకారమే చొక్కా మార్చినట్లు తెలిసిందన్నారు. పులి సాగర్‌ను వైసీపీ వాళ్లే మట్టుబెట్టే ప్రమాదం ఉందన్నారు. అతను జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో బంగారు నాగేశ్వరరావు, యర్రంశెట్టి రాజ్‌కుమార్, కానేటి ప్రభుదాస్, బూరా రమణ, మేడికొండ అప్పారావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : డీఈవో



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న డీఈవో వాసుదేవరావు

అనపర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు శారీరక ధృడత్వానికే కాకుండా మానసిక ఉల్లాసానికి ఉపకరిస్తాయని విద్యార్థులు క్రీడల పట్ల ఆశక్తిని చూపాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. గురువారం అనపర్తిలోని జీబీఆర్ విద్యా సంస్థల క్రీడా ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే ఇంట్రా స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడా వందనం స్వీకరించి క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. 100మీటర్ల పరుగు పందెం పోటీలను ప్రారంభించిన డీఈవో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 150 కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీబీఆర్ విద్యా సంస్థల అధ్యాపకులు, యాజమాన్య కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీబీఆర్‌లో రక్తదాన శిబిరం

జీబీఆర్ డిగ్రీ కళాశాలలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కాకినాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులు రక్తాన్ని సేకరించారు. 56మంది విద్యార్థులు రక్తదానం చేశారని ప్రిన్సిపాల్ ఎస్‌పీ అబ్బాయిరెడ్డి తెలిపారు.

రబీకి ఎంటీయూ 1121 అనుకూలం

కొవ్వూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రబీ(దాళ్వా) పంటకు ఎంటీయూ 1121 శ్రీధృతి రకం వరి అనువైనదని కొవ్వూరు మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.గంగాధర్ తెలిపారు. మండలంలో వరి కోతలు పూర్తి కావడంతో రైతులు నారుమడులను సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఎంటీయూ 1121 వరి రకం అనువైనదన్నారు. ఈ రకం 130 నుంచి 135 రోజుల్లో చేతికి వస్తుందన్నారు. ఆరోగ్యవంతమైన నారు తయారీకి జాగ్రత్తలు పాటించాలన్నారు. నారుమడికి 10నుంచి 12రోజుల ముందే దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారి చెప్పారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఓటు హక్కు ఉపయోగించుకున్న ఉపాధ్యాయులు

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు



కోరుకొండలో ఓటు హక్కు ఉపయోగించుకున్న ఉపాధ్యాయులు

అనపర్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం అనపర్తిలో ప్రశాంతంగా ముగిసింది. అనపర్తి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 45వ నెంబరు కేంద్రంలో పోలింగ్ జరిగింది. మండలంలో మొత్తం 108 మంది ఓటర్లు ఉండగా 98మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ అనంతరం పోలీసు బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్సులను కాకినాడకు తరలించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గోకవరంలో 90శాతం

గోకవరం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలో 54మంది టీచర్స్ ఓట్లకు గాను, 49 ఓట్లు(90శాతం) పోలైనట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఎస్.శ్యామ్యూల్స్ తెలిపారు. ఎటువంటి గొడవలు జరగకుండా స్థానిక ఎస్ఐ పవన్‌కుమార్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



కడియంలో ఏర్పాటు చేసిన శిబిరం

కడియంలో 91శాతం

కడియం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో 68 మంది ఉపాధ్యాయ ఓట్లు ఉండగా 62 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

సీతానగరంలో 97శాతం

సీతానగరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 33 మంది ఓటర్లకు గాను 32 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తహశీల్దారు పోశిబాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా సీఐ ఎ.వెంకటేశ్వరరావు ఎటువంటి సంఘటనలు జరగకుండా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

రంగంపేటలో 96శాతం

రంగంపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రశాంతంగా ముగిసాయని ఎన్నికల అధికారి డి.సుధీర్‌కుమార్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 24వ పోలింగ్ కేంద్రంలో మండలంలో మొత్తం 29 ఓట్లకు 28 ఓట్లు పోలయ్యాయని తెలిపారు.

రాజానగరం 96శాతం

రాజానగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మండలంలో 109 మంది ఉపాధ్యాయులకు గాను 105 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

కోరుకొండలో 97శాతం

కోరుకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు మధ్య పోలింగ్ నిర్వహించారు. యూటీఎఫ్, పీఆర్టీయూ, ఎస్టీయూ సంఘాల తరుపున శిబిరాలు ఏర్పాటు చేసుకుని ఉపాధ్యాయులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. మండలంలో 73 మంది ఓటర్లకు గాను 71 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.



బిక్కవోలులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ మురళీకృష్ణ

రసాయన ఎరువుల వాడకంతో భూసారం క్షీణత

• కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు

• ప్రపంచ నేల దినోత్సవం.. భూసార పరీక్షా పత్రాల అందజేత



కలవచర్ల కేవీకేలో రైతులకు సూచనలిస్తున్న హెడ్ నాయుడు

రాజానగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రసాయనిక ఎరువుల వాడటం వల్ల వ్యవసాయ భూముల్లో నేల ఆరోగ్యం క్షీణిస్తుందని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు పేర్కొన్నారు. మండలంలో కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడం, కోతను, కాలుష్యాన్ని తగ్గించడంలో నేల నిర్వహణ పాత్రపై అవగాహన పెంచేందుకు నేల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్టు చెప్పారు. మన నేలలను రక్షించడం తక్షణ అవసరం అన్నారు. కొన్ని దశాబ్ధాలుగా రసాయనిక ఎరువులు అధిక మోతాదులో వాడడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుందని అనేక అధ్యయనాలు వెలువరించాయన్నారు. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యవంతమైన నేలలు.. గ్లోబల్ వార్మింగ్‌ను కట్టడి చేయడంలో ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం ఈ సందర్భంగా హాజరైన రైతులకు భూసార పరీక్షా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కేవీకే సబ్జెక్టు మేటర్ స్పెషలిస్టులు బి.నాగేశ్వరరెడ్డి, రవీంద్ర, ఎన్‌వీ రఘునందన్, సంజయ్ హెగ్డే, రత్నాజీ, వివిధ మండలాలకు చెందిన 50 మంది రైతులు హాజరైనారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ) స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ విభాగం ఆధ్వర్యంలో నేల దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యవసాయ విభాగాధిపతి బీవీవీ బలరాం భగత్ మాట్లాతుతూ సుస్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించడంతో పాటు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలన్నారు.

ఎస్సీ,ఎస్టీలకు ప్రభుత్వ ఉచిత విద్యుత్ పథకం రద్దుకాలేదు

వైసీపీనేతల తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్ పథకం రద్దుకాలేదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ పథకాన్ని నిలిపివేశారని వైసీపీ నేతలు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎస్సీ, ఎస్టీలు దీనిని నమ్మవద్దన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏదోరకంగా వైసీపీ నేతలు బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎస్సీ ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకం కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో 15,17,298 ఎస్సీ కుటుంబాలు, 4,75,557 ఎస్టీ కుటుంబాలకు ఈ పథకం కింద లబ్ధిచేకూరుతుందన్నారు. ప్రతి నెలా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇంకా ఎవరైనా అర్హులై ఉండి 200యూనిట్ల ఉచిత విద్యుత్ పొందకపోతే విద్యుత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



దేవీచౌక్‌లో డ్రైనేజీపై ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

దేవీచౌక్‌లో ఆక్రమణల తొలగింపు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో డ్రైనేజీల ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగం తొలగింపు చర్యలు చేపట్టింది. నగరంలో గత ప్రభుత్వ అడ్డగోలు నిర్మాణాల వల్ల మురుగునీటి పారుదలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో మూడు నెలల కిందట నగరంలో జాంపేట, ఆజాద్ చౌక్, పేపరుమిల్లు రోడ్డు తదితర ప్రాంతాల్లో రహదారుల ఫుట్‌పాత్, డ్రైనేజీల ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. కొద్దిరోజులపాటు ఈ ప్రక్రియను నిలుపుదల చేశారు. ఇప్పుడు దేవీచౌక్-లక్ష్మీవారపుపేట రోడ్డులో ఆక్రమణలు తొలగింపు పనులు చేస్తున్నారు. కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ అధికారులు డ్రైనేజీల ఆక్రమణలు తొలగింపు పనులు చేస్తున్నారు.



విజయవాడ బీజేపీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికే

బీజేపీ వారధి

ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన వారధి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వారధి కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఆయా శాఖల అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తు న్నామన్నారు. కార్యక్రమంలో వారధి సమన్వయకర్త కిలారి దిలీప్, రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

కోరుకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కోరుకొండలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 1953లో ప్రారంభమైన ఈ ఉత్సవాలకు బిక్కవోలు తరువాత పేరొన్నిక కలదు. ప్రస్తుతం 71వ వార్షిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు వుల్లి బుచ్చిబాబు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు 7 నుంచి ప్రారంభమై 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. శనివారం రాత్రి స్వామి ఆలయం వద్ద మోపర్తి వెంకట కృష్ణ దంపతులతో స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. అదేరోజు రాత్రి వీరభద్రుడి సంబరం, రాత్రి 9 గంటలకు ఆడిటోరియంలో సినీ సంగీత విభావరి ఉంటుందన్నారు. ఆదివారం రాత్రి పాలకొల్లు వారిచే సినీ మ్యూజికల్ నైట్, సోమవారం రాత్రి తాడేపల్లిగూడెం వారి కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు జరుగుతాయన్నారు. మంగళవారం రాత్రి రాజమండ్రి వారిచే సినీ సంగీత విభావరి, 11న రాత్రి రాజమహేంద్రవరం వారిచే భక్త చింతామణి నాటకం, 12న సంగీత విభావరి ఏర్పాటు చేశామన్నారు. స్వామి వారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రభుత్వ హైస్కూల్ నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. బుధవారం ఉదయం స్వామి వారి కల్యాణ మండపం వద్ద 108 మంది దంపతులతో స్వామి వారికి శాంతి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. చివరిరోజు 12న ఉదయం స్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్య అతిధులుగా షష్ఠి ఉత్సవాల్లో పాల్గొంటారని ఆలయ అభివృద్ధి కమిటీ వైస్ ప్రెసిడెంట్ బదిరెడ్డి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ఈ సంవత్సరం స్వామి వారికి నూతన ఆలయ నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని బస్టాండ్ వర్తక సంఘం, గ్రామస్తులు, దాతల సహకారాలతో నిర్వహిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజానగరం విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్ వార్షిక మరమ్మతుల నిమిత్తం నేటి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆనంద్ గార్డెన్స్‌లో వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున రూ.40 వేల పింఛన్లు పంపిణీ చేశారు. వాసంశెట్టి వరలక్ష్మి సంస్మరణార్థం అన్నదానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన వారణాసి కామేశ్వరి రూ.15 వేలు, ర్యాలీ ఉమామహేశ్వరావు రూ.5 వేలు విద్య నిమిత్తం పేద విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు, కార్యదర్శి గంగాభవాని, వాసంశెట్టి గంగాధర్, మణిశంకర్, గణేష్, కడియాల శ్రీనివాస్, కొత్తూరి బాలభీమరాజు తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవం సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తున్న జై భీమ్ అసోసియేషన్ సభ్యులు

ఘనంగా జై భీమ్ అసోసియేషన్ వార్షికోత్సవం

గోకవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గోకవరం ఆర్టీసీ డిపోలో జై భీమ్ అసోసియేషన్ ప్రథమ వారికోత్సవాన్ని గురువారం జరిపారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పైడమళ్ళ లక్ష్మణ్, అప్పాజీ, వీఎల్ రావు, ఎస్ఆర్‌కే దొర తదితరుల పర్యవేక్షణలో డిపో మేనేజర్ యు.రామన్న, అసిస్టెంట్ మేనేజర్ అడ్డాల అప్పారావుతో పాటు డిపో సిబ్బందికి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ జై భీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం గుర్తించాలి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవా సంస్థల కృషి వెలకట్టలేనిదని స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో గురువారం ఇంటర్నేషనల్ వలంటీర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేశారు. డాక్టర్ బళ్ళ శ్రీనివాసరావు, అనూప్ కుమార్ జైన్ మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా పలు రకాల సేవలను స్వర్ణాంధ్ర అందిస్తున్నదన్నారు. అనంతరం పుష్కరాల రేవు, ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, జి.దివ్యకుమారి, వై.హరికృష్ణ, ఐ.మీరాకుమారి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న గుబ్బల రాంబాబు

నేడు, రేపు మెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలోని అథ్లెటిక్స్ ట్రాక్ గ్రౌండులో ఈ నెల 6, 7 తేదీల్లో ఆదికవి నన్నయ యూనివర్శిటీ అంతర్ కళాశాలల మెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు జరగనున్నాయి. ఈ టోర్నమెంట్‌కు యూనివర్శిటీ పరిధిలోని కళాశాలల నుంచి క్రీడాకారులు రానున్నారని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఫుట్‌బాల్ టోర్నమెంట్‌తోపాటు యూనివర్శిటీ జట్టును ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు నన్నయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్, ఎస్.శోభారాణి హాజరవుతారన్నారు.

రంగంపేట తహశీల్దార్‌గా అనసూయ



అనసూయ

రంగంపేట, డిశంబరు 5(ఆంధ్రజ్యోతి):రంగంపేట తహశీల్దార్ (ఎఫ్ఏసీ)గా గురువారం కోసు అనసూయ బాధ్యతలు చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈమె గోకవరం తహశీల్దార్‌గా పోస్టింగ్ తీసుకొని ప్రస్తుతం కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

రెవెన్యూ సదస్సుల షెడ్యూల్లో మార్పులు

సీతానగరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలంలో 7వ తేదీ నుంచి జరగాల్సిన రెవెన్యూ సదస్సులు ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహిస్తామని తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఈ నెల 10న ములకల్లంక సదస్సును బొబ్బిల్లంకలో గ్రామ సచివాలయం 2లో, 11న మిర్తిపాడు, 13న మునికూడలి, 16న రఘుదేవపురం, 18న చినకొండేపూడి, 20న కాటవరం, జాలిమూడి కాటవరం. 21న సీతానగరం, 24న సింగవరం, 26న నాగంపల్లి, 28న నల్గొండ, రాపాక, 30న వంగలపూడి, జనవరి 2న పురుషోత్తపట్నం, జనవరి 3న ఉండేశ్వరపురం, 4న కూనవరం, 7న ముగ్గళ్ళ, 8న బొబ్బిల్లంక గ్రామ సచివాలయాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మార్పులు గమనించి వినియోగదారులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా వృత్తి విద్యా కళాశాలల కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వృత్తి విద్యా కళాశాలల యాజమాన్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. రాజమహేంద్రవరం ప్రతిభా వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా పి.సంజీవరావు (ప్రతిభ), ఉపాధ్యక్షుడిగా జి.అనిల్ కుమార్ (రాజానగరం), కార్యదర్శిగా కె.కమలాకర్ (జయరామ్), కోశాధికారిగా పి.వెంకట వరప్రసాద్ (గోకవరం) లను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.శాంతికుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.బాలరాజు, సెక్రటరీ పి.యెర్నెస్ట్ మోజెస్, జాయింట్ సెక్రటరీ బుజ్జి దొర, జిల్లా కళాశాలల యాజమాన్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



జిల్లా వృత్తి విద్యా కళాశాలల యాజమాన్య నూతన కార్యవర్గం

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: మెకానిక్ రాకీ
సూర్యామినీ	: క
సూర్యాప్యాలస్	: మెకానిక్ రాకీ
స్వామి	: అమరన్
శివజ్యోతి	: జీబ్రా
అనుశ్రీ(సాయికృష్ణ)	: రణగల్
రాజా	: క
ఊర్వశి	: కంగువా
రంభ	: ఉద్వేగం
మేనక	: ఆదిపర్వం
అప్సర	: రోటీ కపడా రొమాన్స్
కుమారి	: ఇష్క్
అశోక	: లక్కీభాస్కర్
వీఎస్ మహల్(నామవరం)	: అమరన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: మెకానిక్ రాకీ
వెంకటసూర్య(కడియం)	: అమరన్
సత్యగౌరి (అనపర్తి)	: లక్కీభాస్కర్
సూర్యశ్రీ (అనపర్తి)	: మెకానిక్ రాకీ
ఫార్ట్యూన్ సినిమాస్(రాజానగరం)	: అమరన్
రామకృష్ణ(కోరుకొండ)	: ---
గీతాసినిమాస్ (సీతానగరం)	: మెకానిక్ రాకీ
శ్రీనివాస (గోకవరం)	: అమరన్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: లక్కీభాస్కర్
లలితామహల్(రంపచోడవరం)	: మెకానిక్ రాకీ
నవయుగ(చింతూరు)	: -----





నల్లజర్లలో పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి

ఓటింగ్ ఇలా.. ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఆరు జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ శాతం ఇలా నమోదైంది.

జిల్లా	కేంద్రాలు	ఓట్లు	పోలైనవి	శాతం
అల్లూరి	12	637	565	88.70
తూర్పు	20	2990	2753	92.07
ఏలూరు	20	2667	2444	91.64
కాకినాడ	22	3418	3118	91.22
కోనసీమ	22	3296	3138	95.21
పశ్చిమ	20	3729	3484	93.43
మొత్తంగా	116	16737	15502	92.62

92.62%

ఓటెత్తారు!



ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

ఓటు విలువ తెలిసినోళ్లు.. తమకు నచ్చిన.. తాము మెచ్చిన నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటెత్తారు.. జరిగేది ఉప ఎన్నికైనా ఎక్కడా వెనక్కితగ్గలేదు.. తాయిలాల్లేకున్నా.. గిఫ్ట్ బాక్సులు ఇవ్వకున్నా.. పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు.. 60 శాతం.. 70 శాతం కాదు.. ఒక దశలో నూరుశాతం ఓటింగ్ ఉంటుందా అనేటంతగా క్యూకట్టారు.. చివరికి ఆరు జిల్లాల పరిధిలో 92.62 శాతం మంది బ్యాలెట్ ఓటేశారు.. మరో మూడు రోజుల్లో మా.. స్టారెవరో తేలిపోనుంది.. ఎందుకంటే 9న కౌంటింగ్.. అదే రోజు ఫలితం వెల్లడిస్తారు.. మొత్తం మీద ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ఉపపోరు గురువారం ప్రశాంతంగా ముగిసింది.

కాకినాడలో 91.22 శాతం

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మాస్టార్లు ఓటెత్తారు.. ఓటుకు క్యూకట్టారు. నూరుశాతం దిశగా ఓటింగ్ సాగింది.. ఆరు జిల్లాల పరిధిలో ఎక్కడా ఓటింగ్ తగ్గుముఖం పట్టలేదు. దూరాన్ని సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. మహిళా ఉపాధ్యాయినులు పోటెత్తారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాల్లో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 16737 మంది ఓటర్లకు 15,502 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరిగింది. కాకినాడ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి ఏఆర్వో ఆధ్వర్యంలో వివిధ పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని నిత్యం పర్యవేక్షించారు. కంట్రోల్ రూమ్ నుంచి ప్రతి రెండు గంటలకు ఓటింగ్ శాతం విడుదల చేశారు. ఎన్నికల సందర్భంగా కాకినాడ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కాకి నాడ జేఎన్‌టీయూలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. అన్ని జిల్లాల నుంచి గురువారం రాత్రి స్ట్రాంగ్‌రూమ్‌కు బ్యాలెట్ బాక్సులు చేరుకున్నాయి. పోలింగ్ సిబ్బంది నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకునేందుకు ప్రత్యేక రిసెప్షన్ కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి కాకినాడ జేఎన్‌టీయూలో ఈనెల 9వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అదే రోజు సాయంత్రానికి ఫలితాలను వెల్లడిస్తారు. ఐదుగురు అభ్యర్థులు పోటీపడుతుండగా, విజేత ఎవరో తేలిపోతుంది. 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగుస్తుంది.

- ఎక్కడికక్కడ క్యూకట్టిన టీచర్లు
- ఉత్సాహంగా బ్యాలెట్ ఓటు
- ఆరు జిల్లాల పరిధిలో ఇదే సీన్
- 116 కేంద్రాల్లో పోలింగ్
- బరిలో ఐదుగురు అభ్యర్థులు
- కోనసీమలో అత్యధిక ఓటింగ్
- అల్లూరి జిల్లాలో అత్యల్పం
- కాకినాడలో కంట్రోల్ రూమ్‌లు
- జేఎన్‌టీయూలో స్ట్రాంగ్ రూమ్
- రాత్రికే తరలిన బాక్సులు
- 9న కౌంటింగ్.. ఫలితం
- 12 వరకూ ఎన్నికల కోడ్





కాకినాడలో ఓటేస్తున్న ఉపాధ్యాయుడు



రాజమహేంద్రవరంలో పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్



అమలాపురంలో ఓటేస్తున్న టీచర్

తూర్పున 92.07 శాతం

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లాలో 92.07 శాతం ఓట్లు పోలయ్యాయి. జిల్లాలో మొత్తం 2990 మంది ఓటర్లు ఉండగా 2753 మంది ఓటేశారు. 237 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. ఉదయం 10 గంటలకు 20.90 శాతం, 12 గంటలకు 51.70 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 74.28 శాతం, సాయంత్రం 4 గంటలకు 90.54 శాతం పోలైంది. మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కొంత మంది టీచర్లు ఓటు హక్కు వినియోగించుకోలేదు. ప్రభుత్వ ఉపాధ్యాయులంతా ఓటు హక్కు వినియోగించుకున్నట్టు చెబుతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసేవారే కొంతమంది రాలేదనేది సమాచారం.జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను రాజమహేం ద్రవరం ఆర్ట్స్ కాలేజిలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.వీటిని జిల్లా రెవిన్యూ అధికారి (డీఆర్వో) టి.సీతారామమూర్తి,ఆర్డీవోలు ఆర్. కృష్ణనాయక్,రాణి సుస్మిత, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ దేవి తదితరులు పర్యవేక్షించారు. ఎన్నికల పరిశీలకుడు కె.హర్షవర్ధన్ స్ట్రాంగ్ రూమ్ ఇక్కడ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.నల్లజర్లలో పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి పరిశీలించారు.



3 ఓట్లు.. 150 కి.మీ

వై.రామవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం ఎగువ ప్రాంతమైన డొంకరాయి 6వ నెంబరు పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడే ఓట్లు ఉన్నాయి. వై.రామవరం నుంచి ఎన్నికల నిర్వహణ సిబ్బంది 150 కిలోమీటర్లు తరలివెళ్లి పోలింగ్ నిర్వహించారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారని జోనల్ అధికారి బాపన్నదొర చెప్పారు.



కోనసీమలో 95.21 శాతం

అమలాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. 22 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచే ఓటింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. 95.21 శాతం మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావు తెలిపారు. ఉదయం పోలింగ్ ప్రక్రియ మందకొడిగా ప్రారంభమైనప్పటికీ మధ్యాహ్నానికి ఊపందుకుంది. జిల్లాలో 3296 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 3138 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 158 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 2165 మంది పురుష ఓటర్లకు 2060 మంది, 1131 మంది మహిళా ఓటర్లకు 1078 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 95.21 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 60లో అత్యధికంగా 606 మంది ఓటర్లు ఉండగా 574 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 94.72 శాతం నమోదైంది.



కొవ్వూరులో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఆర్‌డీవో రాణిసుస్మిత



పిఠాపురంలో కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో మాట్లాడుతున్న ఎన్నికల ప్రత్యేకాధికారి హర్షవర్ధన్



రాజమహేంద్రవరంలో బ్యాలెట్ బాక్స్‌లను అప్పగిస్తున్న సిబ్బంది



కాకినాడలో ఓటేస్తున్న టీచరమ్మ

మూడు ఇసుక ర్యాంప్‌లకు 37 దరఖాస్తులు

రాజమహేంద్రవరం డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల టెండర్లు పిలిచిన మూడు ఇసుక ర్యాంప్‌లకు 37 దరఖాస్తులు వచ్చాయి. వంగలపూడి 1,2, జీడిగుంట ఓపెన్ ర్యాంప్‌లకు ఇటీవల టెండర్లు పిలిచారు.టెండర్లకు గురువారం చివరిరోజు కావడంతో ఇసుక కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. వీటిని శుక్రవారం ఖరారు చేయనున్నట్టు మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరుతో మోసం చేయడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ ఇన్‌చార్జి సీఐ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని టీ.నగర్‌కి చెందిన దొమ్మేటి దుర్గా వెంకట సత్యనారాయణ ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలకడంతో రెండేళ్ల కిందట తణుకు పట్టణానికి చెందిన కోసూరి రమేశ్ దఫదఫాలుగా రూ.6లక్షలు ఇచ్చాడు. అయితే అతడు సరైన సమాధానం లేకపోవడం, ఉద్యోగం రాకపోవడంతో రమేశ్ టూటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రుడాకు కొత్త మాస్టర్ ప్లాన్

చైర్మన్ బీవీఆర్ చౌదరి

నేడు, రేపు ఫుట్‌బాల్ టోర్నమెంట్

పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలి 8

రేపు బడి పండుగ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రభుత్వ బడులన్నీ చరిత్రలోనే తొలిసారిగా ఓ వేడుకకు చేసుకోబోతున్నాయి. పిల్లలు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో శనివారం పండుగ నిర్వహించనున్నారు. అదే రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేస్తున్న 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్'. పిల్లల బంగారు భవితకు ఒక్క అడుగు ముందుకు అనే నినాదంతో భారీ కార్యక్రమానికి పాఠశాలలను సిద్ధం చేశారు. ఇప్పటి వరకూ స్కూల్లో పరిస్థితి తల్లిదండ్రులకు, పిల్లల చదువు పట్ల వారి మనసులో భావాలు ఉపాధ్యాయులకు పూర్తిగా తెలిసేవి కావు.ముందు ఈ ఖాళీని పూరిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చనే సత్సంకల్పంతో నిర్వహిస్తుండడంతో ఈ వేడుకకు ప్రాధాన్యం ఏర్పడింది.ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులు/సంరక్షకులకు పండుగకు రావాలంటూ ఆహ్వాన పత్రికలు అందజేశారు. జిల్లాలోని 714 ప్రాథమిక, 72 ప్రాథమికోన్నత, 202 ఉన్నత పాఠశాలల్లో బాలురు 49348, బాలికలు 54074 మంది..వారి తల్లిదండ్రులు, రాజకీయ నాయకులు,ప్రముఖులు, ప్రజాప్రతినిధులు తదితరులు సుమారు 3 లక్షల వరకూ ఈ వేడుకల్లో పాల్గొనే ఆవకాశం ఉంది. ఏర్పాట్లకు ఇప్పటికే జిల్లాకు రూ.23లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్షించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

నాడు అలా - నేడు ఇలా

గత వైసీపీ ప్రభుత్వంలో అటు ఉపాధ్యాయులకు బోధనకు సమయం లేకపోగా.. ఇటు విద్యార్థుల చదువు అటకెక్కింది. సీబీఎస్‌సీ, ఐబీ అంటూ రోజుకో సిలబస్, ట్యాబ్‌లు, ఫ్లాట్ ప్యానెళ్లు ఇలా ప్రచార ఆర్భాటానికి విద్యావ్యవస్థను అవస్థల్లోకి నెట్టేశారు. పిల్లల్లో అభ్యసనా సామర్థ్యం అడుగంటే దుస్థితికి చేరుకొంది. పది ఫ్లస్ ఫెయిలస్సయ్యింది. బోధన కోసం సమయం లేకుండా బోధనేతర పనులు ఎక్కువ కావడంతో ఉపాధ్యాయులు ఆవేదన అంతా ఇంతా కాదు. జీతాల కోసం రోడ్డెక్కిన గడ్డు రోజులను అనుభవించారు.కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రేపటి పౌరుల బంగారు భవిత కోసం అభూత కల్పనల కంటే అక్షరం ముఖ్యమని విద్యారంగాన్ని గాడిలో పెట్టే పని మొదలు పెట్టిం ది.విద్యా మంత్రిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచే నారా లోకేశ్ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

పారదర్శకతే ప్రామాణికతగా

విద్యార్థి ఉదయం బడికి వచ్చి సాయంత్రం ఇంటికి చేరుకొంటే ఆ రోజుకు చదువు గడిచిపోయినట్టు కాదు. ప్రతి విద్యార్థిని సానబట్టి తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుంది. దానికి తగిన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలి. అలాగే పిల్లల మంచి నడవడిక, క్రమశిక్షణకు తొలి అడుగు ఇంటి నుంచే వేయాలి. ఈ మూడింటికీ సమన్వయం కుదిరితే పిల్లలు సునాయాసంగా ఉన్నత స్థాయికి చేరుకోడానికి మార్గం సుగమం అవుతుంది. ఇప్పటి వరకూ పాఠశాలకు తల్లిదండ్రులు వచ్చి పిల్లాడి గురించి ఆరా తీసిన సందర్భాలు ఒకటీఅరా ఉండేవి. అలాగే పాఠశాలల్లోని స్థితిగతులపై వారికి అవగాహన ఉండేది కాదు. వీటన్నిటికీ కూటమి ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టనుంది. విద్యార్థి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు/సంరక్షకులు కూర్చుని విద్యార్థి భవిష్యత్తు, బడి అభివృద్ధే లక్ష్యంగా స్నేహపూర్వకంగా చర్చిస్తారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

తల్లిదండ్రులు, పిల్లలు, ఉపాధ్యాయులు కలిసి ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంటా ఉల్లాసంగా,ఉత్సాహంగా జరపాలని ఇప్పటికే ఆదేశాలు అందాయి.ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9-9.30 గంటల వరకూ తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు,దాతలు,ప్రముఖులు, ఎస్ఎంసీ సభ్యులు, వార్డు పెద్దలు, అధికారులకు పిల్లలు, ఉపాధ్యాయులు స్వాగతం పలుకుతారు. 9.30-11 గంటల వరకూ విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు అందజేయడంతో పాటు పిల్లల నడవడిక, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చిస్తారు. తల్లిదండ్రుల సూచనలను స్వీకరిస్తారు. 11-11.20 గంటల వరకూ ఆసక్తి ఉన్న మహిళలకు తరగతి వారీగా రంగోలీ, పురుషులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహిస్తారు.తర్వాత35 నిమిషాలపాటు పాఠశాల మైదానంలో సమావేశం, తక్కువ నిడివి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ప్రధానోపాధ్యాయులు స్కూల్ ప్రోగ్రెస్‌పై వివరణ ఇస్తారు. అనంతరం సైబర్ క్రైంపై అవగాహన, మహనీయుల స్ఫూర్తి గాథలు, ఆహూతుల నుంచి అభిప్రాయాల సేకరణ, ప్రతిజ్ఞ ఉంటుంది. 12.35 గంటలకు అందరూ కలిసి భోజనం చేసిన తర్వాత కార్యక్రమాన్ని ముగిస్తారు.

- చరిత్రలో తొలిసారి నిర్వహణ
- జిల్లాలో 988 పాఠశాలలు
- 1,03,422 మంది విద్యార్థులు
- పాఠశాలల అభివృద్ధిపై చర్చ
- 3 లక్షల మంది వస్తారని అంచనా
- ఉదయం ఆరంభం
- మధ్యాహ్నం వరకూ నిర్వహణ
- రూ.23 లక్షలు విడుదల

అద్భుతమైన కార్యక్రమం



ఇదొక అద్భుతమైన కార్యక్రమం. 988 పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లూ చేశాం. పిల్లల బంగారు భవితకు, పాఠశాల అభివృద్ధికి స్నేహపూర్వక వాతావరణంలో చర్చ జరుగు తుంది.శుక్రవారం సన్నద్ధ కార్యక్రమాలు చేయాలని చెప్పాం. మెగా పేరెంట్ టీచర్ మీట్ రోజున తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు చేశాం. పాఠశాలతో పాటు ప్రతి విద్యార్థి ప్రస్తుత స్థితిని తల్లిదండ్రులకు వివరించడమే కాకుండా వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం. ఇప్పటికే ఆహ్వాన పత్రికలు అందజేశాం.

- కె.వాసుదేవరావు,డీఈవో



పేరెంట్స్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న టీచర్లు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వ నిర్ణయాలకు లోబడి పరిష్కరిస్తామని రాజమహేంద్రవరం కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం రాత్రి ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థలో 2393 మంది వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ఉద్యోగపరంగా, పదోన్నతులు, జీతాలు, సెలవులు తదితర సమస్యలపై చర్చించారు.16 ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించారు. ఉద్యోగులు భోజనాలు చేయడానికి హాలు, పనివేళలు ముగిశాక ఆడుకోవడానికి షటిల్ కోర్టు, వాహనాల పార్కింగ్‌కు స్థలం ఏర్పాటు చేయాలని కోరుతూ నగరపాలక సంస్థ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం వినతిపత్రం అందించింది. గ్రేడు 2 ఎలక్ట్రీషియన్ పేరూరి సూర్యప్రకాశరావుకు సహాయ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పించాలని, లేదా డ్రాయింగ్ డ్యూటీ విధానంలో నియమించాలని కోరారు. పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న క్లీనర్లకు డ్రైవర్లగా పదోన్నతి కల్పించాలని ఉద్యోగులు విన్నవించారు. సచివాలయంలో పనిచేస్తున్న కార్యదర్శులు తమ సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఉద్యోగులు తమ జీవితంలో పొదుపును ఒక భాగంగా చేసుకోవాలని ఉద్యోగులకు కమిషనర్ కేతన్‌గార్గ్ సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎస్ఈ జి.పాండురంగారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న,ఈఈ మాధవి, మదర్షా ఆలీ, మేనేజరు అబ్దుల్ మాలిక్ అస్సర్, రెవెన్యూ అధికారి -2 శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉద్యోగుల సమస్యలు వింటున్న కమిషనర్

ప్రతిభను వెలికితీసేవి క్విజ్‌పోటీలు

రిలయన్స్ క్విజ్ పోటీల్లో డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, మేధాశక్తిని పెంపొందించడానికి క్విజ్ పోటీలు దోహదపడతాయని డీఎస్ఈవో వాసుదేవరావు పేర్కొన్నారు.స్థానిక ఆనం కళా కేంద్రంలో రిలయన్స్ ఫౌండర్ ధీరుభాయ్ అంబానీ జయంతి సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలకు ఆయన హాజరై మాట్లాడారు.గత 12 ఏళ్లుగా ధీరుభాయ్ అంబానీ పేరున విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ పోటీలు ప్రతి ఏటా విద్యార్థులకు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. జిల్లాలో 160 ఉన్నత పాఠశాలల నుంచి 640 మంది విద్యార్థులు క్విజ్ పోటీలకు హాజరయ్యారని చెప్పారు. అనంతరం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మండపేట గౌతమి మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.దీక్షిత, గీతాశ్రీలకు రూ.42 వేలు విలువ చేసే రెండు ల్యాప్ టాప్‌లు అంద జేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన కాతేరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వి.వరుణ్ తేజ్, కే సత్యసాయిలకు రూ.15వేలు విలువగల రెండు ట్యాబ్‌లు అందించారు. తృతీయ స్థానంలో నిలిచిన వివిధ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 10 మందికి రూ.7500 విలువ గల సైకిళ్లను అందించారు. జనరల్ నాలెడ్జిలో ప్రతిభ చాటిన 25 మందికి వాటర్ బాటిల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ సంస్థ ప్రతినిధులు ఆపరేషన్స్ హెడ్ ప్రవీణ్ నందగిరి, సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం, ఉద్యోగులు ఐ.సత్యశ్రీనివాస్, పి.వెంకట్రావ్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ విజేతలకు ల్యాప్ ట్యాప్‌లు అందజేత

గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా పశుసంవర్థక శాఖాధికారి శ్రీనివాసరావు


గుడ్డిగూడెంలో నిర్మించిన గోకులంషెడ్లు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

గోపాలపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పాడిపశువులకు సంరక్షించుకునే రైతులకు ఉపాధి హామీ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో ఇటీవలె నిర్మించిన గోకులం షెడ్లను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎండ, వాన, మంచు బారిన పడకుండా పశువులను సంరక్షించుకోవడానికి గోకులం షెడ్లు ఉపయోగపడతాయన్నారు. ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న ఈ షెడ్లకు రైతులు సద్వినియోగం చేసుకుని తమ పాడిపశువులను సంరక్షించుకోవాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో బీఎస్ఎస్.శ్రీనివాస్, డాక్టర్ ధరిన్‌బాబు ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి మంత్రి దుర్గేష్ పూజలు


పెరవలి: మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

పెరవలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కామల శివారు ముచ్చర్ల వారి పాలెం, కానూరు అగ్రహారం గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలను రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ గురువారం దర్శించుకున్నారు. ఈ ఆలయాలను ఇటీవల ఆధునీకరించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద హోమాలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద మంత్రికి పూర్ణ కుంభాలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు

నిడదవోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరంలో స్వర్ణదుర్గ ఆలయ పునర్నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. మంత్రి దుర్గేష్ ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొవ్వూరు ఇసుక ర్యాంపు పరిశీలన


దండకుంట పుంత ర్యాంపును పరిశీలిస్తున్న తహశీల్దార్ దుర్గాప్రసాద్

కొవ్వూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు దండకుంట పుంత ఇసుకర్యాంపును తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ గురువారం పరిశీలించారు. దండకుంట పుంత-2 ఇసుకర్యాంపులో ఎటువంటి అనుమతులు లేకుండా ఏటిగట్టు మార్జిన్ ల్యాండ్‌లో మట్టి తవ్వకాలు చేపట్టారని నిలుపుదల చేయాలని ది విజ్జేశ్వరం బోట్స్‌మేన్ కోపరేటివ్ సొసైటీ సభ్యులు ఫిర్యాదు చేశారని, దీనిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించగా ఇసుక ర్యాంపు నిర్వహించిన వారు భూమిని పాడుచేశారని, పాడు చేసిన లూజ్‌సాయిల్‌ను తొలగిస్తున్నామని సరిహద్దు రైతులు తెలిపారని తహశీల్దార్ పేర్కొన్నారు. మట్టి తవ్వకాలు నిలుపుదల చేసి మట్టి తొలగించిన ప్రదేశాన్ని క్వారీ చత్రుతో పూడ్చి ఏటిగట్టును పటిష్టం చేయాలని రైతులను ఆదేశించామన్నారు. గోదావరి వరదల సమయంలో మార్జిన్‌లో ఉన్న లూజు సాయిల్ కొట్టుకుపోతుండడంతో సొంత భూములు కొట్టుకుపోయే ప్రమాదం ఉండడంతో లూజుసాయిల్ తొలగించి చత్రు, రాళ్లతో గట్టును పటిష్టపరుస్తున్నట్టు తెలియజేశారన్నారు.

పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు


సమావేశంలో పాల్గొన్న ఉమామహేశ్వరరావు

నల్లజర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఆర్సీ బకాయిలను చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం నల్లజర్లలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌ను పీడీఎఫ్ అభ్యర్థి గోపి మూర్తితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఉద్యోగులకు 22 వేల కోట్లు బకాయి ఉన్నట్టు చెప్పారు. ఏ ప్రభుత్వం వచ్చిన ఉద్యోగులను మోసం చేస్తునే ఉన్నారని విమర్శించారు. గతంలో వాడుకున్న విద్యుత్‌కు ఇంధన సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలను దోచుకోవడం సిగ్గుచేటన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర రహదారులపై టోల్ టాక్స్ వసూలు చేసే నిర్ణయం సరికాదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షులు ఫకృద్దీన్,బి కిషోర్, కొక్కిరపాటి వెంకట్రావు, ఐవీ సత్యం, ఎస్ఎం ఆలీ సాహెబ్, సీహెచ్ మనోహర్‌కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి

నిడదవోలు, డిసెంబరు 05 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైపోయిందని ఆ నష్టాన్ని భర్తీ చేయడం అసాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం నిడదవోలులో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వంలో కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చాక చార్జీలు పెంచి ప్రజలపై మరింత భారాన్ని మోపారన్నారు. ప్రజలకు మంచి జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే సాధ్యమన్నారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడిగా మేడవరపు భద్రందొరను నియమించారు. కార్యక్రమంలో మార్టిన్ లూథర్, చిన్నం మురళీకృష్ణ, కారింకి వెంకటేశ్వరరావు, పుల్లారావు, అగర్వాల హీరాలాల్, శారద పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిశీలన


వెలగదుర్రు ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌ను పరిశీలిస్తున్న నేషనల్ క్వాలిటీ అసెస్మెంటు టీమ్

ఉండ్రాజవరం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): వెలగదుర్రు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను నేషనల్ క్వాలిటీ అసెస్మెంటు టీమ్ పరిశీలించింది. ఈ కేంద్రం ద్వారా ప్రజకు అందుతున్న సేవలు, వాటి విధానం, పాటించే పద్ధతులు, నియమాలు, రికార్డులు నిర్వహించే పద్ధతి, సిబ్బంది నైపుణ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో అసెస్మెంటు టీమ్ మెంబర్లు డాక్టర్ ఎలాంగో, పంకజం, సహాయకులు నవీన, డాక్టర్ సుధ పాల్గొన్నారు. టీమ్ వెంట ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషాదేవి, వైద్య సిబ్బంది ఉన్నారు.

బెల్టు షాపులపై దాడులు

44 మద్యం సీసాల స్వాధీనం
ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు


స్వాధీనం చేసుకున్న మద్యంసీసాలు, నిందితులు

దేవరపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో బెల్టు షాపులపై దాడులు నిర్వహించి 44 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బీ.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.7వేలు ఉంటుందన్నారు. గోపాలపురం మండలం దొండపూడిలో దాడి చేసి 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. వాటి విలువ రూ.2500 ఉంటుందన్నారు. గత నెల అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న 12 షాపులపై దాడులు నిర్వహించి 12మందిని అరెస్టు చేసి, సుమారు రూ.25వేలు విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి ఐదుకేసులు నమోదు చేసి 35లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ఏవీవీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల లెక్కింపు

పెరవలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. 38 రోజులకు ప్రధాన హుండీ ద్వారా రూ.4,39, 720 అన్నదాన హుండీ ద్వారా రూ.7,272 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో తెలిపారు. కార్యక్రమంలో తనిఖీదారు సత్య వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఆర్డీవో రాణి సుస్మిత


కొవ్వూరులో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

కొవ్వూరు/తాళ్లపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రెవెన్యూ పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. గురువారం కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో ఎన్నికల సరళిని పరిశీలించి, సిబ్బందికి సూచనలు, సలహాలను అందజేశారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఉన్నారు. కొవ్వూరు పట్టణ, మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 89.69శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 233 మంది ఓటర్లకు గాను 209 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

93శాతం పోలింగ్

అలాగే తాళ్లపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 73వ పోలింగ్‌బూత్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలు తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఎస్ఐ టి.రామకృష్ణ పర్యవేక్షణలో ముగిసాయి. పోలింగ్‌బూత్‌ను ఆర్డీవో సుస్మిత, కొవ్వూరు సీఐ విశ్వం పరిశీలించారు. మొత్తం 60 ఓట్లకు గానూ 56 మంది ఓటును వినియోగించుకున్నారని ఓటింగ్ శాతం 93.33 అని తహశీల్దార్ తెలిపారు.

గోపాలపురంలో 96శాతం

గోపాలపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గోపాలపురం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 94వ పోలింగ్‌బూత్ వద్ద సెక్టార్ ఆఫీసర్ కె.వేదవల్లి ఆధ్వర్యంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ కేంద్రానికి సుమారు 100మీటర్లలోపు 144 సెక్షన్ అమలు చేసి పోలీస్ పహారా నిర్వహించారు. మొత్తం 54మంది ఓటర్లకు గాను 52మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 4గంటల తరువాత బ్యాలెట్ బ్యాక్సును కలెక్టర్ కార్యాలయానికి రూట్ ఆఫీస్ కేఎస్.రాజు ఆధ్వర్యంలో తరలించారు.


నిడదవోలులో పోలింగ్ కేంద్రం పోలీసు భద్రత


దేవరపల్లిలో పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్

చాగల్లులో 93శాతం

చాగల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించారు. మండలంలో 58 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా వారిలో 54 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొవ్వూరు ఆర్‌డీవో రాణి సుస్మిత, అడిషనల్ ఎస్పీ దేవకుమార్ పర్యవేక్షించారు.

నిడదవోలులో 91.78శాతం

నిడదవోలు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 207 మంది ఓటర్లకు గాను 190 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 91.78% ఓటింగ్ నమోదైనట్టు బి.నాగరాజు నాయక్ తెలిపారు.

దేవరపల్లిలో 97.77శాతం

దేవరపల్లి, డిసెంబరు 5(ఆంధ్ర జ్యోతి): దేవరపల్లిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలో మొత్తం 90మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 88మంది ఓటుహక్కు వినియోగించుకున్నారని తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. పోలింగ్ 97.77శాతం నమోదైనట్టు చెప్పారు.

నల్లజర్లలో 95శాతం

నల్లజర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నల్లజర్లలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలో 139 ఓటర్లకు గాను 132 ఓట్లు పోలై 95శాతం పోలింగ్ నమోదైంది. తహశీల్దార్ కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తీ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాన్ని డీఎస్పీ దేవకుమార్, ఎమ్మెల్సీ అభ్యర్థి గోపి మూర్తి పరిశీలించారు.

పెరవలిలో 98శాతం

పెరవలి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పెరవలిలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 66 ఓటర్లకు గాను 44 పురుషులు, 21 మంది మహిళా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక అధికారులకు ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు.


పెరవలి పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు


గోపాలపురంలో పోలింగ్ కేంద్రం వద్ద అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

వినూత్నరీతిలో సంక్రాంతి సంబరాలు

ఎమ్మెల్యే మద్దిపాటి


సంక్రాంతి ఉత్సవ ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ఈ తరంపై ఉందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెం గ్రామంలో కొన్నేళ్లుగా సంక్రాంతి సంబరాలు జరుపుతున్న నిర్వాహకులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి సాంప్రదాయ పండుగని, కొన్నేళ్లుగా వేళ్ల చింతలగూడెంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాలను నియోజక వర్గస్థాయికి విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. సంబరాలను వినూత్నరీతిలో నిర్వహిస్తామని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లకు సంబంధించి నిర్వాహకులతో చర్చించినట్టు ఆయన చెప్పారు. కార్యక్ర మంలో ఇల్లూరి రాము, కొర్లపాటి రాము, పరిమి జగదీష్, దుగిరాల శ్రీను, జ్యేష్ట శ్రీనివాసరావు, జ్యేష్ట శ్రీధర్, మద్దిపాటి రమేష్, భూరెడ్డివాసు పాల్గొన్నారు.

రబీకి ఎంటీయూ 1121 అనుకూలం

కొవ్వూరు మండల వ్యవసాయ శాఖాధికారి గంగాధర్

కొవ్వూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రబీ(దాళ్వా) పంటకు ఎంటీయూ 1121 శ్రీధృతి రకం వరి అనువైనదని కొవ్వూరు మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.గంగాధర్ తెలిపారు. మండలంలో వరి కోతలు పూర్తి కావడంతో రైతులు నారుమడులను సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఎంటీయూ 1121 వరి రకం అనువైనదన్నారు. ఈ రకం 130 నుంచి 135 రోజుల్లో చేతికి వస్తుందన్నారు. ఆరోగ్యవంతమైన నారు తయారీకి జాగ్రత్తలు పాటించాలన్నారు. నారుమడికి 10నుంచి 12రోజుల ముందే దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయాలి. నారు ఒక ఆకు పూర్తిగా పురి విచ్చుకునే వరకు ఆకు తడులు ఇచ్చి తర్వాత పలుచగా నీరు నిలకట్టాలి. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. నారు తీయడానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరుంచి వేయాలని వ్యవసాయాధికారి తెలిపారు.

రుడాకు కొత్త మాస్టర్ ప్లాన్

- 3వేల చదరపు మీటర్ల మేర అమలు యోచన
- పుష్కరాల నాటికి రివర్ ఫ్రంట్ సుందరీకరణ
- ఈ నెల 31 నుంచి భవన అనుమతులు సులభతరం
- ఆంధ్రజ్యోతితో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి


రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ప్రయత్నాలు ప్రారంభించాం. గుడా ఉండగా సుమారు 200 చదరపుకిలోమీటర్ల పరిధిలో మాస్టర్ ప్లాన్ రూపొందించారు. కానీ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో రుడా పరిధిలోని మొత్తం ఏరియాను కలుపుతూ సుమారు 3 వేల చదరపు కిలోమీటర్లు కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నట్టు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. దేశంలోనే మంచి ఎక్స్‌పర్ట్‌లైన కన్సల్టెన్సీలతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. రుడా పరిధిలో తూర్పుగోదావరి జిల్లాతో పాటు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట, మండపేట నియోజకవర్గాల్లోని కొంతభాగం, రామచంద్రపురం టౌన్ కూడా ఉందన్నారు. మొత్తం ఏరియాని అర్బనీకరించే విధంగా విశాలమైన రోడ్లు, వాన నీరు ఎక్కడా నిల్వలేకుండా ఉండడం కోసం స్టార్మ్‌వాటర్ డ్రైనేజీ సిస్టమ్, గ్రామాల్లో కూడా పారిశుధ్య సమస్యలు లేకుండా చూడడం కోసం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్‌ను మండల పరిధిలోకానీ,నియోజకవర్గ పరిధిలో కానీ చేసేట ట్టు ఉంటే బాగుంటుందనే ఆలోచన చేస్తున్నామ ని తెలిపారు. మంచినీటి సరఫరా కూడా అన్ని ప్రాంతాలకు ఉండే విధంగా ఈ మాస్టర్‌ప్లాన్‌లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పార్కులు, స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్, పేదల కోసం వెల్ఫేర్ హౌసింగ్, మధ్య తరగతి ఇతర వర్గాలకు ఎఫర్టబుల్ హౌసి ంగ్, ఇండస్ట్రియల్ టౌన్ షిప్‌కు అనుకూలంగా మాస్టర్ ప్లాన్ ఉంటుందన్నారు. హౌసింగ్ ఇతర సౌకర్యాలను రుడా, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో రూపొందించనున్నట్టు స్పష్టం చేశారు. రుడా ద్వారా ప్రజల ఇళ్లు, ఇతర నిర్మాణాల విషయంలో ఇబ్బందులు లేకుండా చూస్తామని, ఈ నెల 31 నుంచి జీ ప్లస్ 5 అంతస్తుల వరకూ ఎవరు భవనాలు నిర్మించుకున్నా ఆఫీసుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగన వసరం లేదన్నారు. లైసెన్స్ సర్వేయర్‌తో ప్లాన్ గీయించుకుని.. ఆన్‌లైన్‌లో పెడితే అదే డీమ్డ్ అప్రూవల్ అవుతుందన్నారు. పనులు ఆరంభించే టప్పుడు రుడా, ఆర్ఎంసీ సిబ్బంది ఎవరైనా వచ్చి పరిశీలించి ఎన్‌వోసీ ఇస్తారన్నారు. ఇక ఎవరి ప్రమేయం లేకుండా కట్టడం నిర్మించుకోవచ్చని చెప్పారు. రుడా ద్వారా ప్రభు త్వానికి ఆదాయం వచ్చే మార్గాలు పరిశీలిస్తున్నామని, ఖాళీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడంతోపాటు పార్కుల వద్ద షాపులు నిర్మిస్తామన్నారు. వీటి అద్దెల ద్వారా ఆదాయం వస్తుందని చెప్పారు. మినీ సోలార్ ప్లాంట్లు నిర్మించే ఆలోచన ఉందన్నారు.

అన్ని ప్రాంతాల్లో సుందరీకరణ..

2027లో వచ్చే గోదావరి పుష్కరాల నాటికి గోదావరిని ఆనుకుని ఉన్న అన్ని ప్రాంతాల్లో రివర్‌ఫ్రంట్ సుందరీకరణ చేస్తామని చైర్మన్ తెలిపారు. రాజమహేంద్రవరం సిటీలో పర్వాలేదని, దానితో పాటు రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడదవోలు, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే మొత్తం రివర్‌ఫ్రంట్‌ను సుందరీకరించి..కనీసం సైకిల్ వాక్‌కు అనుకూలంగా ఉండేటట్టే చేసే ఆలోచన ఉందన్నారు. రుడా పరిధిలో గత ప్రభుత్వంలో చేసిన పనుల నిర్వహణ ఎవరనేది స్పష్టత లేదని, అనేక గ్రామాల్లో జిమ్‌లు నిర్మించినా నిర్వహణ బాధ్యత ఎవరికీ అప్పగించకుండా వది లేశారన్నారు. తాము దీర్ఘకాలిక ప్రయోజనంతో పాటు నిర్వహణ కూడా ఉండే పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు స్పష్టంచేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మీటింగ్ పెట్టి గతంలో అనుమతుల్లేకుండా కట్టిన కట్టడాలు, వచ్చే ఆదాయం వంటి వాటిపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



చాగల్లు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలటూరుకు చెందిన శతాధిక వృద్ధురాలు నిమ్మగడ్డ లక్ష్మీకాంతం (104) ఇటీవల మృతి చెందారు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు నిమ్మగడ్డ చిన రామారావు (చిన రాములు) మాజీ సర్పంచ్‌గా చేశారు. లక్ష్మీకాంతం మృతికి పార్టీలకు అతీతంగా పలువురు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

నేడు, రేపు ఆర్ట్స్ కళాశాలలో ఫుట్‌బాల్ టోర్నమెంట్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలోని అథ్లెటిక్స్ ట్రాక్ గ్రౌండులో ఈనెల 6, 7 తేదీల్లో ఆదికవి నన్నయ యూనివర్శిటీ అంతర్ కళాశాలల మెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు జరుగనున్నాయి. ఈ టోర్నమెంట్‌కు యూనివర్శిటీ పరిధిలోని కళాశాలల నుంచి క్రీడాకారులు రానున్నారని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఫుట్‌బాల్ టోర్నమెంట్‌తోపాటు యూనివర్శిటీ జట్టును ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు నన్నయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్, ఎస్.శోభారాణి హాజరవుతారన్నారు.

వృత్తి విద్యా కళాశాలల జిల్లా నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వృత్తి విద్యాకళాశాలల యాజమాన్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. రాజమహేంద్రవరం ప్రతిభా వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా పి.సంజీవరావు (ప్రతిభ), ఉపాధ్యక్షుడిగా జి.అనిల్‌కుమార్ (రాజానగరం), కార్యదర్శిగా కె.కమలాకర్ (జయరామ్), కోశాధికారిగా పి.వెంకట వరప్రసాద్(గోకవరం)లను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం రాష్ట్రాధ్యక్షుడు డి.శాంతికుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.బాలరాజు, సెక్రటరీ పి.యెర్నెస్ట్‌మోజెస్, జాయింట్ సెక్రటరీ బుజ్జిదొర, జిల్లా కళాశాలల యాజమాన్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'జై భీమ్' వారికోత్సవం

గోకవరం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): గోకవరం ఆర్టీసీ డిపోలో జై భీమ్ అసోసియేషన్ ప్రథమ వారికోత్సవ గురువారం ఘనంగా జరిగాయి. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పైడిమళ్ల లక్ష్మణ్, అప్పాజీ, వీఎల్.రావు, ఎస్ఆర్‌కే.దొర పర్యవేక్షణలో డిపో మేనేజర్ యు.రామన్న, అసిస్టెంట్ మేనేజర్ అడ్డాల అప్పారావుతో పాటు డిపో సిబ్బందికి స్వీట్స్ పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

చాగల్లు, డిశంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐదు ఎకరాలు లోపు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులకు బహువార్షిక పశుగ్రాసం సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ఉపయోగించుకుని పాడి పరిశ్రమను వృద్ధి చేసుకోవాలని పశువైద్య అధికారి యు ముఖేష్ తెలిపారు. రైతు సొంత భూమిలో పది సెంట్లు నుండి 50 సెంట్లు వరకు సాగు చేసుకోవచ్చునని చెప్పారు. నిర్ణీత పొలంలో దక్కి చేయడం, విత్తనాలు వేయడం, నీటి యాజమాన్యం, కలుపు నివారణ, ఎరువుల కోసం ప్రభుత్వం ఆర్థిక పోత్సాహం అందిస్తుందన్నారు. ఎంపికైన వారికి 100 రోజులు పని దినాలు కల్పిస్తారు. పూర్తిచేసిన ధరఖాస్తుకు ఆధార్, జాబ్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు, పొలం 1బి, పారం, బ్యాంక్ పాస్ బుక్, రేషన్ కార్డు జిరాక్సులను జతచేసి అందజేయాలన్నారు. పూర్తి వివరాలు కోసం రైతు సేవా కేంద్రం, లేదా జాతీయ ఉపాధిహామీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

నేడు దేవరపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో టౌన్ ఫీడర్ పని నిమిత్తం దేవరపల్లిలో శుక్రవారం ఉద యం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తు న్నట్టు ట్రాన్స్‌కో ఏఈ సీహెచ్.వెంకట్రావు తెలిపారు. అలాగే అచ్చెయ్యపాలెం వ్యవ సాయ బోర్లకు 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

రంగంపేట తహశీల్దార్‌గా అనసూయ

రంగంపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రంగంపేట తహశీల్దార్(ఎఫ్ఏసీ)గా గురువారం కోసు అనసూయ బాధ్యతలు చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.